పోరు తెలంగాణ
పత్రిక ప్రకటనల కోసం
మరియు
చందాదారులుగా
చేరండి చేర్పించండి
వివరాలకు
సంప్రదించండి సెల్
8555918136

# పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక




కరీంనగర్ సంపుటి : 11 సంచిక : 322 సోమవారం 31-08-2026 ఎడిటర్ : కొండ ప్రవీణ్ కుమార్ పేజీలు : 04 వెల : 04

## టిబెట్‌లోనూ జలవిలయం.. నిజాలు దాస్తున్న డ్రాగన్

- ★ టిబెట్-నేపాల్ సరిహద్దులో భారీ వరదలతో తీవ్ర నష్టం
- ★ విలయానికి సంబంధించిన వీడియోలు చైనాలో తొలగింపు
- ★ అంతర్జాతీయంగా వైరల్ అవుతున్న భయానక దృశ్యాలు
- ★ వరద నష్టం కాకుండా సహాయక చర్యలకే చైనా మీడియా ప్రాధాన్యం
- ★ వందలాది మంది గల్లంతైనా వివరాలు వెల్లడించని అధికారులు



టిబెట్-నేపాల్ సరిహద్దులోని గైరాంగ్ పోర్టు ప్రాంతంలో సంభవించిన జల ప్రళయానికి సంబంధించిన భయానక దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా వైరల్ అవుతుండగా, చైనా ప్రభుత్వం మాత్రం వాటిని తన దేశంలో మీడియాలో కనపడకుండా కఠిన చర్యలు చేపట్టింది. వరద విలయం - మిగతా 2 లో

## భారత్‌తో ఘర్షణల నాటి జనరల్‌ను పదవుల నుంచి తొలగించిన చైనా

- ❖ గల్వాన్, డోక్లాం ఘర్షణల నాటి జనరల్‌పై చైనా వేటు
- ❖ పీఎల్ఏ మాజీ జనరల్ జావో జోంగ్కీని కీలక పదవుల నుంచి తొలగింపు
- ❖ ఎలాంటి అధికారిక కారణం వెల్లడించని బీజింగ్ ప్రభుత్వం
- ❖ సైన్యంపై పట్టు బిగించేందుకు జిన్‌పింగ్ చేపట్టిన ప్రక్షాళనలో భాగంగానే ఈ చర్యలు



భారత్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) మాజీ జనరల్ జావో జోంగ్కీపై చైనా ప్రభుత్వం వేటు వేసింది. దేశంలోని అత్యున్నత రాజకీయ - మిగతా 2 లో

## మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యమన్న మంత్రి ఉత్తమ్



- ● ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి
- ● తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర అనుమతే లక్ష్యం
- ● భారీ లిఫ్టులు లేకుండా గ్రావిటీ ద్వారా 80 టీఎంసీల తరలింపునకు ప్లాన్
- ● సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల చర్చలు

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు - మిగతా 2 లో

# ఓటర్ల తొలగింపుపై సీఈసీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

- ▶▶ గడువు 4 వారాలు పొడిగించాలని విజ్ఞప్తి
- ▶▶ తెలంగాణలో 92.86 లక్షల ఓట్లు పోయాయన్న రేవంత్ రెడ్డి
- ▶▶ అర్హులైన వారు ఓటు కోల్పోకుండా సమగ్ర పరిశీలన జరపాలని విన్నపం
- ▶▶ ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రతను కల్పించాలన్న సీఎం




తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (గ×=) ప్రక్రియపై కేంద్ర ఎన్నికల

## 22ఏ భూముల సమస్యలపై పోరుబాట



- ➤ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో రాంచందర్ రావు కీలక భేటీ
- ➤ మరో రెండు పోరాటాలకు రెడీ అవుతున్న తెలంగాణ బీజేపీ
- ➤ సెప్టెంబర్ 5, 6 తేదీల్లో 22ఏ భూముల వ్యవహారంపై దీక్ష
- ➤ ఆదిలాబాద్నుంచి అసెంబ్లీ వరకు రైతు యాత్ర

తెలంగాణలో ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ పార్టీని బలోపేతం చేసుకునే దిశగా - మిగతా 2 లో

# వెనెజువెలాతో అమెరికా చారిత్రాత్మక ఆయిల్ డీల్

- ▶▶ 65 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలు అమెరికా నియంత్రణలోకి
- ▶▶ పెరుగుతున్న గ్యాస్ ధరల నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వ కీలక వ్యూహం
- ▶▶ ఈ ఒప్పందంతో అమెరికాలో ఇంధన ధరలు తగ్గుతాయన్న అంచనాలు
- ▶▶ వెనెజువెలాలో 100 బిలియన్ డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులకు అవకాశం




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఓ సంచలన ప్రకటన చేశారు. దక్షిణ అమెరికా దేశమైన వెనెజువెలాతో చమురు ఒప్పందం కుదిరిందని, దీని ద్వారా ఆ దేశంలోని 65 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలను అమెరికా

## వ్యక్తిగత పర్యటనలో విషాదం

నేపాల్ వరదల్లో ఇన్ఫోసిస్ ఉన్నతాధికారి గల్లంతు





- ★ నేపాల్ వరదల్లో ఇన్ఫోసిస్ అనుబంధ సంస్థ హెడ్ లక్ష్ గోపిశెట్టి గల్లంతు
- ★ వ్యక్తిగత పర్యటనకు వెళ్లగా ఆయన ఆచూకీ తెలియడం లేదని ఇన్ఫోసిస్ ధ్రువీకరణ
- ★ ఆయనను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని, కుటుంబానికి అండగా ఉన్నామని ప్రకటన
- ★ గోపిశెట్టికి ఇన్ఫోసిస్‌తో పాటు యాక్సెంచర్, ఐబీఎం వంటి సంస్థల్లో పనిచేసిన సుదీర్ఘ అనుభవం

నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న ఆకస్మిక వరదల్లో ప్రముఖ ఐటీ సంస్థ - మిగతా 2 లో

## సహాయం వద్దన్న నేపాల్.. 24 గంటల్లోనే మాట మార్పు!



- ➤ నేపాల్ వరదలు.. అంతర్జాతీయ సాయంపై వెనక్కి తగ్గిన ప్రభుత్వం
- ➤ దౌత్య ఒత్తిడితో విదేశీ బృందాలకు పరిమిత అనుమతి
- ➤ 550 దాటిన మృతుల సంఖ్య, 1900 మందికి పైగా గల్లంతు
- ➤ సహాయం అందించేందుకు ముందుకొచ్చిన భారత్, ఇతర దేశాలు
- ➤ టన్నెల్ రెస్క్యూ, డీఎన్ఏ పరీక్షల్లో విదేశీ నిపుణుల సాయం

నేపాల్‌లో సంభవించిన భీకర వరద విపత్తు విషయంలో ఆ దేశ ప్రభుత్వం - మిగతా 2 లో

## ఎవరూ హైదరాబాద్ రావద్దు, రెండు రోజుల్లో నేనే గుంటూరు వస్తా



- ● వైసీపీ నేత అంబటి రాంబాబుకు విజయవంతంగా స్టెంట్ల చికిత్స
- ● రొటీన్ చెకప్‌లో భాగంగా గుండెలో రెండు బ్లాకులు గుర్తింపు
- ● ప్రస్తుతం తన ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి
- ● హైదరాబాద్ రావద్దని, రెండు రోజుల్లో గుంటూరు వస్తానని కార్యకర్తలకు సూచన
- ● హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్న మాజీ మంత్రి

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తన ఆరోగ్య పరిస్థితిపై స్వయంగా స్పందించారు. - మిగతా 2 లో

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన



- ❖ మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ
- ❖ సెప్టెంబర్ 2 వరకు వర్షాల తీవ్రత కొనసాగే అవకాశం ఉందని వెల్లడి
- ❖ లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని, దీని ప్రభావంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రాబోయే కొద్దిరోజుల్లో వర్షాలు - మిగతా 2 లో

# ఏకగ్రీవాలపై అధికారంలో ఒక మాట ఇప్పుడొక మాట: చంద్రబాబు

- ▶▶ ఏకగ్రీవాలపై గత ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని సీఎం చంద్రబాబు విమర్శ
- ▶▶ గిరిజన ప్రాంతాల్లో 'సంజీవని' ప్రాజెక్టు ద్వారా ఇంటింటికీ వైద్య సేవలు అందించే కార్యక్రమానికి శ్రీకారం
- ▶▶ రూ.250 కోట్లతో ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన
- ▶▶ గత పాలనలో జే బ్రాండ్లు, బలవంతపు మత మార్పిడులతో రాష్ట్రాన్ని నాశనం చేశారని ఆరోపణ
- ▶▶ సెప్టెంబర్ 2న అనకాపల్లికి గోదావరి జలాలు, 31న వెలిగొండకు కృష్ణా జలాలు విడుదల




స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాల విషయంలో గత పాలకులు ఇప్పుడు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏకగ్రీవాలను ప్రోత్సహించి, ఇప్పుడు వాటిని వ్యతిరేకించడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. అరకు నియోజకవర్గంలోని గన్నెలలో శనివారం జరిగిన 'సంజీవని' ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

# ఎవరూ హైదరాబాద్ రావద్దు, రెండు రోజుల్లో నేనే గుంటూరు వస్తా

మొదటిపేజీ తరువాయి - సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా తన గుండెలో రెండు బ్లాకులు గుర్తించారని, వైద్యుల బృందం విజయవంతంగా స్టెంట్లు వేసి చికిత్స పూర్తి చేసిందని ఆయన తెలిపారు. తనను పరామర్శించేందుకు ఎవరూ హైదరాబాద్ రావద్దని, రెండు రోజుల్లో తానే గుంటూరుకు తిరిగి వస్తానని, అక్కడే అందరం కలుసుకుందామని పార్టీ శ్రేణులకు, అభిమానులకు విజ్ఞప్తి చేశారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం అంబటి రాంబాబు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించారు. యాంజియోగ్రామ్ చేసిన అనంతరం, గుండె రక్తనాళాల్లో రెండు బ్లాకులు ఉన్నట్లు నిర్ధారించి, స్టెంట్లు వేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ప్రస్తుతం అంబటి రాంబాబు ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదని స్పష్టం చేశాయి. ఈ వార్త తెలియడంతో తొలుత వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు ఆందోళనకు గురయ్యారు. అయితే, చికిత్స విజయవంతం కావడం, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# బంగాళాఖాతంలో మరో అల్పపీడనం.. తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

మొదటిపేజీ తరువాయి - మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. బంగాళాఖాతంలో వేగంగా మారుతున్న ఈ వాతావరణ మార్పుల నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల వాసులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ వర్షాల తీవ్రత సెప్టెంబర్ 2 వరకు కొనసాగే అవకాశం ఉందని, ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఇక తెలంగాణలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని, రాజధాని హైదరాబాద్‌లో రానున్న 24 గంటల్లో ఆకాశం దట్టంగా మేఘావృతమై అప్పుడప్పుడు వాన చినుకులు పడే అవకాశం ఉందన్నారు. వర్షాలు, ఈదురుగాలుల సమయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. పిడుగులు పడే ప్రమాదం ఉన్నందున బహిరంగ ప్రదేశాల్లో ఉండకూడదని... చెట్లు, భారీ విద్యుత్ స్తంభాలు, పాత భవనాల కింద నిలబడ వద్దని హెచ్చరించారు. వర్షం కురుస్తున్న సమయాల్లో వాహనదారులు ప్రయాణాల్లో వేగాన్ని తగ్గించి జాగరూకతతో వాహనాలు నడపాలని విపత్తు నిర్వహణ శాఖ కోరింది.

# మహారాష్ట్ర అంగీకారమే లక్ష్యమన్న మంత్రి ఉత్తమ్

మొదటిపేజీ తరువాయి - వేస్తోంది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి వద్ద నిర్దేశిత ఎత్తుతో బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర ప్రభుత్వ అంగీకారం పొందడమే తమ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టుపై సెప్టెంబర్ 1న కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్రాష్ట్ర చర్చల నేపథ్యంలో, ఆయన సచివాలయంలో ఉన్నత స్థాయి సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీని నిర్మిస్తే, ఎలాంటి భారీ లిఫ్టుల అవసరం లేకుండానే సుమారు 80 టీఎంసీల ప్రాణహిత జలాలను గ్రావిటీ ద్వారా సహజ సిద్ధంగా సుందిళ్ల బ్యారేజీకి తరలించవచ్చని మంత్రి వివరించారు. ఈ సమావేశంలో అధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, చట్టపరమైన అంశాలపై సమగ్రంగా చర్చించారు. బ్యారేజీ నిర్మాణం వల్ల చేకూరే ప్రయోజనాలు, మహారాష్ట్రలో ముంపు ప్రభావం, గ్రావిటీ ద్వారా నీటి తరలింపునకు ఉన్న సాధ్యాసాధ్యాలపై విస్తృతంగా సమీక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం నిరంతరం జరిపిన సంప్రదింపుల ఫలితంగానే, కేంద్రం చొరవతో ఇరు రాష్ట్రాల మధ్య అధికారిక చర్చలు ప్రారంభం కావడం ఒక సానుకూల పరిణామమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

# 22ఏ భూముల సమస్యలపై పోరుబాట

మొదటిపేజీ తరువాయి - బీజేపీ ముందుకు సాగుతోంది. ఇటీవల విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ విజయవంతంగా దీక్ష నిర్వహించిన బీజేపీ నాయకత్వం... తాజాగా రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలకు వ్యతిరేకంగా మరో రెండు ప్రధాన పోరాటాలకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో నిషేధిత 22ఏ జాబితాలో చేర్చిన భూముల వ్యవహారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల (సెప్టెంబర్) 5, 6 తేదీల్లో బీజేపీ నేతలు భారీ దీక్ష చేపడుతున్నారు. ఈ దీక్షా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై చర్చించేందుకు ఈరోజు నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నేతృత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. మరోవైపు, ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ లోని అసెంబ్లీ వరకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ 'రైతు యాత్ర' చేపడుతున్నారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేయనున్నట్లు బీజేపీ ప్రకటించింది.

# ఓటర్ల తొలగింపుపై సీఈసీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

మొదటిపేజీ తరువాయి - కమిషనర్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఏకంగా 92.86 లక్షల ఓట్ల తొలగింపుకు సంబంధించిన నోటీసులు, పరిశీలనలు వెలువడటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన పౌరులెవరూ ఓటు హక్కు కోల్పోకుండా చూసేందుకు సమగ్ర పరిశీలన అత్యవసరమని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం నిర్ణయించిన గడువులోగా నోటీసులకు స్పందించడం, అభ్యంతరాలు నమోదు చేయడం, అవసరమైన ఆధార పత్రాలను సమర్పించడం సాధారణ పౌరులకు సవాలుగా మారిందని సీఎం పేర్కొన్నారు. ముఖ్యంగా ఉపాధి కోసం తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వలస కూలీలు, రోజువారీ కూలీలు తమ ఓటు హక్కును నిరూపించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించే సమయాన్ని మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని లేఖలో స్పష్టంగా కోరారు. దీంతో పాటు, అత్యధికంగా ఓటర్ల సంఖ్య ఉన్న హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో పరిశీలన ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా సాగేందుకు అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను (ఈఆర్వోలు) తక్షణమే నియమించాలని సూచించారు. గ్రామసభలు, పురపాలక వార్డుల్లో ఓటర్ల జాబితాను బిగ్గరగా చదివి వినిపించాలని, పట్టణ ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ఎస్ఐఆర్ ప్రక్రియను వికేంద్రీకరించడం ద్వారా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ం

# టిబెట్‌లోనూ జలవిలయం.. నిజాలు దాస్తున్న డ్రాగన్

మొదటిపేజీ తరువాయి - తీవ్రతను, వాస్తవ నష్టాన్ని కప్పిపుచ్చుతూ సమాచారంపై ఉక్కుపాదం మోపుతోంది. ఆగస్టు 26న సంభవించిన ఈ ప్రకృతి విపత్తులో, గైరాంగ్ సరిహద్దు క్రాసింగ్ వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తూ వాహనాలను, ఇతర వస్తువులను కొట్టుకుపోతున్న దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ప్రాణభయంతో జనం పరుగులు తీస్తున్న ఈ వీడియోలు అంతర్జాతీయ సోషల్ మీడియా వేదికలపై వేగంగా వ్యాపించాయి. అయితే, చైనాలోని సామాజిక మాధ్యమ ప్లాట్‌ఫామ్‌ల నుంచి ఇలాంటి వీడియోలను అధికారులు తక్షణమే తొలగించారు. అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ ఆదేశించిన సహాయక చర్యలకు మాత్రమే ప్రభుత్వ మీడియా ప్రాధాన్యతనిస్తోంది తప్ప, ప్రాణ, ఆస్తి నష్టం వివరాలను కానీ, బాధితుల వెతలను కానీ బయటి ప్రపంచానికి తెలియనివ్వడం లేదు. టిబెట్‌లోని గైరాంగ్ కౌంటీలో కొద్దిమంది మరణించారని, విదేశీయులతో సహా వందలాది మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. అయితే, ప్రభావితమైన గ్రామాల వివరాలపై కానీ, నష్టం పూర్తి స్థాయిపై కానీ ఇప్పటికీ స్పష్టత ఇవ్వడం లేదు. మరోవైపు, నేపాల్ సరిహద్దు వైపు నుంచి వరద నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలు, చిత్రాలు వెలువడుతుండగా, టిబెట్ వైపు మాత్రం సమాచారాన్ని పూర్తిగా నియంత్రించడంపై మానవ హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. హిమానీనదం (గ్లేసియర్) విచ్ఛిన్నం వల్లే ఈ ఆకస్మిక వరదలు సంభవించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సరిహద్దుకు ఇరువైపులా గాలింపు, సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# భారత్‌తో ఘర్షణల నాటి జనరల్‌ను పదవుల నుంచి తొలగించిన చైనా

మొదటిపేజీ తరువాయి - సలహా మండలి సభ్యత్వంతో పాటు ఆయన నిర్వహిస్తున్న ఇతర కీలక రాజకీయ పదవుల నుంచి జీవోను తొలగించింది. 2017లో జరిగిన డోక్లాం ప్రతిష్టంభన, 2020 నాటి గల్వాన్ లోయ ఘర్షణల సమయంలో జావో జోంగ్కి పీఎల్ఏ వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు అధిపతిగా వ్యవహరించారు. చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ (జుపూజజ) స్టాండింగ్ కమిటీ ఆగస్టు 26న సమావేశమై జావోను పదవుల నుంచి తొలగించాలని ఓటింగ్ ద్వారా నిర్ణయించింది. జాతీయ కమిటీ సభ్యత్వంతో పాటు, జాతి, మతపరమైన వ్యవహారాల కమిటీ డిప్యూటీ డైరెక్టర్ పదవి నుంచి కూడా ఆయన్ను తప్పించారు. అయితే, ఈ నిర్ణయానికి గల కారణాలను చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించలేదు. ఆయనపై ఎటువంటి విచారణకు ఆదేశించినట్లు కూడా ఇప్పటివరకు ప్రకటించకపోవడం గమనార్హం. భారత్‌తో సరిహద్దు వ్యవహారాలను పర్యవేక్షించే వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు 2016లో తొలి కమాండర్‌గా జావో నియమితులయ్యారు. ఆయన పదవీకాలంలోనే 2017లో 73 రోజుల పాటు డోక్లాం ప్రతిష్టంభన కొనసాగింది. అలాగే 2020లో 20 మంది భారత సైనికులు వీరమరణం పొందిన గల్వాన్ ఘర్షణలు కూడా ఆయన పర్యవేక్షణలోనే జరిగాయి. అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సైన్యంలో చేపట్టిన భారీ ప్రక్షాళనలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవలే తీవ్రమైన క్రమశిక్షణా ఉల్లంఘనల ఆరోపణల నేపథ్యంలో జనరల్ జాంగ్ యోక్సియా, లియు జెన్లీలను కూడా సెంట్రల్ మిలిటరీ కమిషన్ నుంచి తొలగించారు. సైన్యంపై తన పట్టును మరింత బిగించుకునే క్రమంలోనే జిన్‌పింగ్ వరుసగా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

# ఏకగ్రీవాలపై అధికారంలో ఒక మాట...ఇప్పుడొక మాట: చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి - "అధికారంలో ఉన్నప్పుడు ఒక మాట, అధికారం కోల్పోయాక మరో మాట మాట్లాడటం వారి నైజానికి నిదర్శనం" అని చంద్రబాబు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కడైనా ఏకగ్రీవం అయితే, సదరు నియోజకవర్గ ఇన్చార్జిదే బాధ్యత... వచ్చే ఎన్నికల్లో వారికి టికెట్ ఉండదు అని జగన్ వైసీపీ నేతలను హెచ్చరించిన నేపథ్యంలో చంద్రబాబు వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా భ్రష్టుపట్టించారని చంద్రబాబు ఆరోపించారు. 'జే బ్రాండ్లు' పేరుతో కల్తీ మద్యం అమ్మి వేల మంది ప్రాణాలతో చెలగాటమాడారని, ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేశారని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక మద్యం విధానాన్ని ప్రక్షాళన చేశామని స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో బలవంతపు మత మార్పిడులకు పాల్పడ్డారని, దేవాలయాల పవిత్రతను దెబ్బతీశారని ఆరోపించారు. ఆర్డీఓ స్థాయి అధికారులను ఎంపిక చేసే గ్రూప్-1 పరీక్ష పత్రాలను ఒక ఎలక్ట్రీషియన్, అటెండర్‌తో దిద్దించి అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారని మండిపడ్డారు. ఇక తన పర్యటన ముఖ్య ఉద్దేశమైన 'సంజీవని' ప్రాజెక్టు వివరాలను సీఎం వెల్లడించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రజల చెంతకే వైద్యం అందించే ఈ ప్రాజెక్టు, ఆరోగ్య రంగంలో తదుపరి స్థాయి విప్లవమని అభివర్ణించారు. ప్రతి కుటుంబానికి డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించి, వారి ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సదుపాయాల మెరుగుదలకు రూ.250 కోట్లతో 'ట్రైబల్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంప్లీషన్ మిషన్' ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. సికిల్‌సెల్, తలసేమియా బాధితులకు నెలకు రూ.10 వేల పెన్షన్ అందిస్తున్నామని, త్వరలో అన్ని మండలాల్లో జన ఔషధి కేంద్రాలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. డ్రోన్ల ద్వారా మారుమూల ప్రాంతాలకు మందులు, వ్యాక్సిన్లు పంపడంతో పాటు రక్త నమూనాలను ల్యాబ్‌లకు తరలించి మెరుగైన వైద్యం అందిస్తామని వివరించారు. గిరిజన ప్రాంతాల సర్వతోముఖాభివృద్ధికి తమ ప్రభుత్వం ఐదు సూత్రాల ప్రణాళికతో ముందుకెళుతోందని చంద్రబాబు తెలిపారు. 'అడవి తల్లి బాట' పేరుతో రూ.1,000 కోట్లతో 905 కిలోమీటర్ల రోడ్లు నిర్మిస్తున్నామని, 1.60 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇస్తామని చెప్పారు. అరకు కాఫీ సాగును మరో లక్ష ఎకరాలకు విస్తరించి, హోమ్‌స్టేల ద్వారా పర్యాటకాన్ని ప్రోత్సహించి గిరిజనులకు ఆదాయ మార్గాలు పెంచుతామన్నారు. స్థానిక యువతకు ఉద్యోగాల కోసం తీసుకొచ్చిన జీఓ నంబర్ 3ని గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే సుప్రీంకోర్టు రద్దు చేసిందని, త్వరలోనే అందరికీ ఆమోదయోగ్యమైన ప్రత్యామ్నాయం తెస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక ప్రాజెక్టులపైనా చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. ఆగస్టు 31న వెలిగొండ ప్రాజెక్టుకు కృష్ణా జలాలను, సెప్టెంబర్ 2న పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సత్యకుమార్ యాదవ్, గుమ్మిడి సంధ్యారాణి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# సహాయం వద్దన్న నేపాల్.. 24 గంటల్లోనే మాట మార్పు!

మొదటిపేజీ తరువాయి - తన నిర్ణయాన్ని మార్చుకుంది. అంతర్జాతీయ సహాయక బృందాలను అనుమతించబోమని మొదట స్పష్టం చేసినా, దౌత్యపరమైన ఒత్తిడితో వెనక్కి తగ్గింది. భోటేకోశీ నది పరీవాహక ప్రాంతాల్లో గల్లంతైన విదేశీ పౌరుల కోసం గాలింపు చేపట్టేందుకు ప్రత్యేక నైపుణ్యం కలిగిన బృందాలను అనుమతించాలని నిర్ణయించింది. సహాయక చర్యలు చేపట్టే సామర్థ్యం తమకు ఉందని, విదేశీ బృందాలు అవసరం లేదని ప్రకటించిన నేపాల్ ప్రభుత్వం, 24 గంటల్లోనే మాట మార్చడం గమనార్హం. తమ దేశ పౌరులు కూడా పెద్ద సంఖ్యలో గల్లంతైన నేపథ్యంలో వారిని వెతికేందుకు తమ బృందాలను అనుమతించాలని పలు దేశాలు నేపాల్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చాయి. దీంతో ప్రభుత్వం పరిమిత సంఖ్యలో, ప్రత్యేక నైపుణ్యం అవసరమైన రంగాల్లో మాత్రమే విదేశీ సహాయం తీసుకోవాలని నిర్ణయించింది. టన్నెల్ రెస్క్యూ, డీఎన్ఏ పరీక్షలు, ఫోరెన్సిక్ పరిశీలన వంటి అంశాల్లో నిపుణుల సేవలను వినియోగించుకోనున్నట్లు విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ తెలిపారు. "సాధారణ సహాయక చర్యలకు విదేశీ బృందాలు అవసరం లేదు. కానీ సాంకేతిక నైపుణ్యం అవసరమైన కొన్ని ప్రత్యేక రంగాల్లో మాకు సహాయం అవసరం" అని ఆయన 'రాయిటర్స్'కు వివరించారు.

### 550 దాటిన మృతుల సంఖ్య, 2000 మంది గల్లంతు

భోటేకోశీ, త్రిశూలి నదుల వెంట సంభవించిన ఈ ఆకస్మిక వరదల కారణంగా శుక్రవారం నాటికి 550 మందికి పైగా మరణించారు. మరో 1,924 మంది ఆచూకీ గల్లంతైందని నేపాల్ విపత్తు నిర్వహణ అథారిటీ నివేదిక పేర్కొంది. గల్లంతైన వారిలో 288 మంది భారతీయులు ఉండగా, 100 మంది చైనీయులు, 65 మంది అమెరికన్లు, 53 మంది ఉక్రెయిన్ వాసులు, 35 మంది ఆస్ట్రేలియన్లు, 33 మంది బ్రిటిష్ జాతీయులు ఉన్నారు. ముఖ్యంగా 216 మెగావాట్ల అప్పర్ త్రిశూలి-1 జలవిద్యుత్ ప్రాజెక్టు వద్ద పరిస్థితి అత్యంత క్లిష్టంగా ఉంది. విపత్తు సమయంలో ఇక్కడ 1,350 మంది పనిచేస్తుండగా, వీరిలో 576 మంది కార్మికుల ఆచూకీ ఇప్పటికీ తెలియరాలేదు. టన్నెళ్లలో చిక్కుకున్న వారిని సకాలంలో గుర్తిస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. వరదలు, కొండచరియలు విరిగిపడటంతో రోడ్లు ధ్వంసమై, మొబైల్, టెలిఫోన్ నెట్‌వర్క్‌లు నిలిచిపోయాయి. దీంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.

### రంగంలోకి భారత్, ఇతర దేశాలు

ఈ విపత్కర పరిస్థితుల్లో నేపాల్‌ను ఆదుకునేందుకు భారత్ ముందుకొచ్చింది. టన్నెల్ రెస్క్యూ బృందం, వైద్య బృందం, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని పంపేందుకు సిద్ధంగా ఉన్నామని భారత విదేశాంగ శాఖ తెలిపింది. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, నేపాల్ విదేశాంగ మంత్రితో ఫోన్‌లో మాట్లాడి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే 10 టన్నుల మానవతా సాయంతో కూడిన మూడో విమానం ఖాట్మండుకు చేరింది. వైద్యులు, టన్నెల్ రెస్క్యూ నిపుణులతో కూడిన 11 మంది సభ్యుల బృందం కూడా నేపాల్‌కు బయల్దేరింది. ఇదే సమయంలో తమ పౌరులు గల్లంతవడంతో దక్షిణ కొరియా కూడా సహాయక బృందాలను పంపేందుకు ముందుకొచ్చింది. ప్రస్తుతం భారత్, చైనా, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియాల నుంచి నిపుణుల బృందాలకు నేపాల్ ఆమోదం తెలిపింది. ఈ బృందాలు ప్రధానంగా రాసువా, నువాకోట్‌లలోని జలవిద్యుత్ ప్రాజెక్టుల టన్నెళ్లపై దృష్టి సారిస్తాయి. మృతదేహాలను త్వరగా గుర్తించి కుటుంబాలకు అప్పగించేందుకు డీఎన్ఏ పరీక్షల ప్రక్రియలో కూడా ఈ నిపుణులు సహాయపడనున్నారు.

# వ్యక్తిగత పర్యటనలో విషాదం





మొదటిపేజీ తరువాయి - ఇన్ఫోసిస్‌కు చెందిన ఉన్నతాధికారి ఒకరు గల్లంతయ్యారు. ఇన్ఫోసిస్ అనుబంధ సంస్థ అయిన 'ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్' హెడ్‌గా పనిచేస్తున్న లక్ష్ గోపిశెట్టి, వ్యక్తిగత పర్యటన నిమిత్తం నేపాల్ వెళ్లారు. నేపాల్-టిబెట్ సరిహద్దుల్లో సంభవించిన వరదల తర్వాత ఆయన ఆచూకీ లభించడం లేదని ఇన్ఫోసిస్ నిన్న ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. ఆయనను గుర్తించి, క్షేమంగా కాపాడటమే తమ కర్తవ్యమని కంపెనీ స్పష్టం చేసింది. ఈ ఘటనపై ఇన్ఫోసిస్ స్పందిస్తూ.. "మా సహోద్యోగి లక్ష్ గోపిశెట్టి వ్యక్తిగత పర్యటనపై ఆ ప్రాంతానికి వెళ్లారు. ప్రస్తుతం ఆయనతో సంబంధాలు తెగిపోయాయి. ఆయన ఆచూకీని కనుగొనడానికి, కాంటాక్ట్ ఏర్పాటు చేయడానికి సంబంధిత ఏజెన్సీలతో కలిసి పనిచేస్తున్నాం. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబంతో నిరంతరం టచ్‌లో ఉంటూ, అవసరమైన అన్ని రకాల సహాయాన్ని అందిస్తున్నాము. లక్ష్ క్షేమంగా ఉండాలని, ఈ విషాదం బారిన పడిన వారందరూ సురక్షితంగా బయటపడాలని ప్రార్థిస్తున్నాము" అని పేర్కొంది. అమెరికా, కెనడాలోని ప్రభుత్వ రంగ ప్రాజెక్టులపై ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ ప్రధానంగా దృష్టి సారిస్తుంది. మరోవైపు, ఈ వరదల తీవ్రతపై భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) కీలక వివరాలు వెల్లడించింది. ఈ విపత్తులో సుమారు 320 మంది భారతీయుల ఆచూకీ గల్లంతైందని, మరో 400 మంది చైనా వైపున చిక్కుకుపోయారని తెలిపింది. చైనా వైపు చిక్కుకున్న వారిలో 153 మంది సురక్షితంగా నేపాల్‌కు చేరుకున్నారని పేర్కొంది. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి కాఠ్‌మండుకు చేరుకున్న 21 మంది భారతీయులు నిన్న మధ్యాహ్నం న్యూఢిల్లీకి చేరుకున్నారని ఎంఈఏ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. ఈ విపత్కర పరిస్థితుల్లో నేపాల్‌కు అన్ని విధాలా సహాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇక, లక్ష్ గోపిశెట్టి నేపథ్యం చూస్తే.. ఆయనకు టెక్నాలజీ రంగంలో అపారమైన అనుభవం ఉంది. ప్రభుత్వ రంగ సంస్థలకు వ్యూహం, టెక్నాలజీ, కార్యకలాపాలు, పరివర్తన వంటి అంశాలపై ఆయన సలహాలు అందిస్తుంటారు. ఇన్ఫోసిస్ పబ్లిక్ సర్వీసెస్ వ్యూహరచన, అమలులో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుత బాధ్యతలకు ముందు, ఆయన ఇన్ఫోసిస్‌లోనే గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్‌గా, బిజినెస్ అప్లికేషన్స్ హెడ్‌గా అమెరికా, యూరప్, ఆసియా అంతటా వ్యాపారాన్ని విస్తరించారు. ఇన్ఫోసిస్‌లో చేరడానికి ముందు ఆయన యాక్సెంచర్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా, అలాగే బేరింగ్‌పాయింట్, ఐబీఎం, పీడబ్ల్యూసీ, హెచ్‌సీఎల్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఉన్నత పదవుల్లో పనిచేశారు. ప్రస్తుతం లక్ష్ గోపిశెట్టితో కాంటాక్ట్ ఏర్పాటు చేసుకునేందుకు ఇన్ఫోసిస్ తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తుండగా, మరోవైపు వరదల్లో చిక్కుకున్న వందలాది మంది భారతీయులను రక్షించేందుకు భారత ప్రభుత్వం విస్తృత స్థాయిలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.

# వెనెజువెలాతో అమెరికా చారిత్రాత్మక ఆయిల్ డీల్



మొదటిపేజీ తరువాయి - నియంత్రణలోకి తీసుకుంటుందని వెల్లడించారు. "ప్రపంచ చరిత్రలోనే అతిపెద్ద చమురు ఒప్పందం"గా దీనిని ఆయన అభివర్ణించారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ మధ్య జరిగిన చర్చల ఫలితంగా ఈ ఒప్పందం సాకారమైందని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. అమెరికాలో గ్యాస్ ధరలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో ఈ ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇరాన్‌తో అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం ఆరు నెలలుగా కొనసాగుతుండటంతో, హర్మూజ్ జలసంధి గుండా చమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అమెరికాలో గ్యాస్ ధరలు ఆకాశాన్నంటాయి. ప్రస్తుతం గ్యాలన్ గ్యాస్ ధర 4.09 డాలర్లుగా ఉండగా, గత ఏడాది ఇదే సమయానికి అది 3.21 డాలర్లుగా ఉండేది. దీంతో అమెరికా తన వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను వాడాల్సి వచ్చింది. ఈ నిల్వలు 2026 ప్రారంభం నుంచి 100 మిలియన్ బ్యారెళ్లకు పైగా తగ్గి, 300 మిలియన్ బ్యారెళ్ల దిగువకు పడిపోయాయి. సుమారు 9 నెలల క్రితం అమెరికా సైన్యం వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్ట్ చేసి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా ఆరోపణలపై విచారణ కోసం అమెరికాకు తరలించింది. అనంతరం తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన డెల్సీ రోడ్రిగ్జ్, దేశ చమురు రంగాన్ని ప్రైవేటీకరణకు అనుమతిస్తూ చట్టం చేశారు. దశాబ్దాల సోషలిస్ట్ పాలనకు ఇది పూర్తి విరుద్ధం. ఈ మార్పే తాజా ఒప్పందానికి మార్గం సుగమం చేసింది. ఈ ఒప్పందం ద్వారా వెనెజువెలాలోకి 100 బిలియన్ డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులు వస్తాయని, అమెరికాలో గ్యాస్ ధరలు తగ్గుతాయని మార్కో రూబియో 'ఎక్స్'లో పేర్కొన్నారు. అయితే, దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన మౌలిక సదుపాయాల కారణంగా వెనెజువెలాలో పెట్టుబడులు పెట్టేందుకు అమెరికన్ ఆయిల్ కంపెనీలు ఎంతవరకు ముందుకొస్తాయనేది వేచి చూడాలి. గతంలో ఎక్సాన్‌మొబిల్ సీఈఓ డారెన్ వుడ్స్, వెనెజువెలాను 'పెట్టుబడులకు అనర్హమైన దేశం'గా అభివర్ణించారు. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వలు (సుమారు 303 బిలియన్ బ్యారెళ్లు) ఉన్నప్పటికీ, మౌలిక సదుపాయాల కొరతతో వెనెజువెలా ప్రస్తుతం ప్రపంచ ఉత్పత్తిలో కేవలం 1% మాత్రమే ఉత్పత్తి చేస్తోంది.

## ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి : జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం ఆగస్టు 31 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ప్రజల సౌకర్యార్థం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, కొత్తగూడెం ఆర్డీవోకార్యాలయంలో,జిల్లాలోని అన్నీ మండల పరిషత్ కార్యాలయాలలో ప్రజావాణి నిర్వహించబడుతుందని తెలిపారు.కావున ప్రజలు ఈ అవకాశాన్నివినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో ఆదివారం కోరారు.

## అంజయ్య ముదిరాజ్ గృహప్రవేశంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నేతలు



**మహేశ్వరం, ఆగస్టు 30, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** అమీర్ పేట్ గ్రామ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుండెమోని అంజయ్య ముదిరాజ్ నూతన గృహప్రవేశానికి టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనతోపాటు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వర్కల యాదగిరి గౌడ్, అమీర్ పేట్ గ్రామ శాఖ అధ్యక్షుడు మన్సన్ పల్లి వెంకటేష్ గౌడ్, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు ఆవుల రఘుపతి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కడల భాస్కర్, సోషల్ మీడియా అధ్యక్షుడు చంద్ర మోహన్, నవీన్ కుమార్, గళ్ళ శ్రీకాంత్, గల్లా అనిల్ కుమార్ పాల్గొన్నారు.

## బోనాలకు రావాలని ఎమ్మెల్యే కు ఆహ్వానం..



**మహేశ్వరం, ఆగస్టు 30, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** మహేశ్వరంలో నిర్వహించే గడికోట మైసమ్మ, పోచమ్మ అమ్మవారి బోనాలకు రావాలని కోరుతూ మహేశ్వరం బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కరోల్ల చంద్రయ్య ముదిరాజ్, మాజీ సర్పంచ్ ఆనందం, పిఎ సి ఎస్ డైరెక్టర్ కాడమోని ప్రభాకర్, వార్డు సభ్యులు చంద్రమౌళి, ఆజాం, వీరిబాబు నాయకులు మినార్ పటేల్ బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కటికల మహేందర్ ముదిరాజ్, హనుమంతు నాయక్, కృష్ణ, రాఘవేందర్, హనీఫ్ పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ గా కంజర్ల కృష్ణమూర్తి



**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి యువకిశోర్ పటాన్చెరువు నియోజకవర్గం ఆగస్టు 30 :** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్ రామచందర్ రావు ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి వివిధ సెల్ లకు కన్వీనర్లను నియమించడం జరిగింది, ఈ కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ గా కంజర్ల కృష్ణమూర్తి ని నియమించడం జరిగింది, ఈ సందర్భంగా కంజర్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ తనకు ఈ పదవిని ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రామచందర్ రావు కి, మెదక్ ఎంపీ శ్రీ రఘునందన్ రావు కి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ శ్రీ అంజిరెడ్డి కి, మరియు జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది, సంగారెడ్డి జిల్లా మరియు పటాన్చెరువు నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది, తనకు ఇచ్చిన సంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ బాధ్యతలను సమర్థవంతంగా మరియు పార్టీ అభివృద్ధి చెందే విధంగా నిర్వహిస్తానని, భారతీయ జనతా పార్టీ యొక్క సిద్ధాంతాలను మరియు పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని కంజర్ల కృష్ణమూర్తిగారు చెప్పడం జరిగింది.

## అట్టహాటంగా కేరళ సాంస్కృతి సాంప్రదాయ ఓనమ్ వేడుకలు

ఓనమ్ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు మాద్రి పృథ్వీరాజ్.




**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి యువకిశోర్ పటాన్చెరువు నియోజకవర్గం ఆగస్టు 30 :** పటాన్‌చెరు నియోజకవర్గంలోని రామచంద్రాపురంలో శ్రీ కన్వెన్షన్‌లో, నాయర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 21వ ఓనమ్ వేడుకల కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేరళ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఓనమ్ వేడుకల్లో పాల్గొని, నిర్వాహకులు, అసోసియేషన్ సభ్యులు, కేరళ సోదర సోదరీమణులకు పృథ్వీరాజ్ ఓనమ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఓనమ్ ఆనందం, ఐక్యత, సౌభ్రాతృత్వం, సమానత్వానికి ప్రతీక. మహాబలి చక్రవర్తి స్ఫూర్తితో ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సుఖసంతోషాలు, శ్రేయస్సు వెల్లివిరియాలని ఆకాంక్షిస్తున్నాను. పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలందరికీ, ముఖ్యంగా కేరళ సోదర సోదరీమణులకు నా హృదయపూర్వక ఓనమ్ శుభాకాంక్షలు.ఓనమ్ పండుగ స్ఫూర్తితో ప్రతి కుటుంబంలో ఆనందం, శాంతి, సౌభాగ్యం, సంపద నిండాలని ఆకాంక్షించారు.

## జిన్నారంలో అంగరంగ వైభవంగా శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన



జిన్నారంలో అంగరంగ వైభవంగా శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన.

ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి.

ఆలయంలో ప్రత్యేక పూజలు.

ఆలయ నిర్మాణానికి రూ.12 లక్షల భారీ విరాళం.



**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి యువ కిషోర్ పటాన్చెరు నియోజకవర్గం ఆగస్టు 30 :** పటాన్చెరు నియోజకవర్గం పరిధిలోని జిన్నారం,ప్రజల్లో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించడంతో పాటు దేవాలయాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. నూతన దేవాలయాల నిర్మాణాలకు సొంత నిధులు కేటాయిస్తూ సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. జిన్నారం మున్సిపల్ కేంద్రంలో మాల సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, మాల సంఘం నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలలో భక్తి భావాన్ని పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్నామని తెలిపారు. దేవాలయాలు కేవలం ఆధ్యాత్మిక కేంద్రాలే కాకుండా ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించే వేదికలుగా నిలుస్తాయని అన్నారు. జిన్నారం ప్రాంత ప్రజల భక్తి విశ్వాసాలకు అనుగుణంగా పోచమ్మ తల్లి ఆలయాన్ని నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణం, మౌలిక వసతుల కల్పన కోసం తనవంతుగా రూ.12 లక్షల భారీ విరాళాన్ని అందించినట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధికి భవిష్యత్తులోనూ అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పోచమ్మ తల్లి ఆశీస్సులతో జిన్నారం ప్రాంత ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, రాజేష్, స్థానిక కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నేటి నుండి సూర్యగిరి ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు

కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారం ఎల్లమ్మ తల్లి..

తండోపతండాలుగా తరలిరానున్న భక్తులు..

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం..





**మహేశ్వరం, ఆగస్టు 30, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి :** భక్తుల కోరికలు తీర్చే కొంగు బంగారం సూర్యగిరి ఎల్లమ్మ తల్లి. ప్రతి ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు హైదరాబాదు నుండే కాకుండా ఇతర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. ప్రతి మంగళవారం సూర్యగిరి ఎల్లమ్మ తల్లికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. సూర్యగిరి ఎల్లమ్మ తల్లి పుణ్యక్షేత్రంతో రావిరాల గ్రామానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చింది. మహిమగల్ల ఎల్లమ్మ తల్లిని పట్టణ ప్రజలతో పాటు ఈ ప్రాంత ప్రజలు గొప్పగా ఆరాధిస్తారు. కోరిన కోరికలను తీర్చే సూర్యగిరి ఎల్లమ్మ తల్లిని భక్తులు నమ్మకంతో పూజిస్తారు. ఈ బ్రహ్మోత్సవాలలో అమ్మవారి కళ్యాణం, అగ్నిగుండం, బోనాలు, ఘటాల ఊరేగింపు ఎంతో భక్తి శ్రద్ధలతో అనవాయితీగా నిర్వహిస్తారు. రావిరాల సూర్యగిరి ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలకు 100 సంవత్సరాల ప్రత్యేక గుర్తింపు ఉంది. నేటి నుండి మూడు రోజులపాటు ఈ బ్రహ్మోత్సవాలు అత్యంత ఘనంగా అంగ రంగ వైభవంగా నిర్వహించేందుకు దేవస్థాన కమిటీ ప్రత్యేక ఏర్పాట్లను చేసింది. నేటి నుండి గణపతి పూజ, పుణ్యా వచనం తో బ్రహ్మోత్సవాలు ప్రారంభమై హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలను ముగిస్తారు. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా రావిరాల ఇతర ప్రాంతాలు జన సముద్రంగా మారనున్నాయి. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థాన కమిటీ అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని సూర్యగిరి ఎల్లమ్మ దేవాలయం ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ రెడ్డిగల్ల రత్నం పేర్కొన్నారు.

## ప్రతి ఒక్క ఓటు కూడా ఎంతో విలువైనది ఏ ఒక్క ఓటు పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి



డి.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల

46 వ డివిజన్లో ఓటర్లకు నోటీసులు అందజేసే కార్యక్రమంలో పాల్గొన్న కొత్వాల, కార్పొరేటర్ విమలాదేవి.



**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ,ఆగస్టు 30(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** ప్రతి ఒక్క ఓటు కూడా ఎంతో విలువైనదని, ఏ ఒక్క ఓటు కూడా పోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డి.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్,పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.ఓటర్ల జాబితా సవరణ (సర్-2) లో భాగంగా శనివారం పాత పాల్వంచ లోని 78, 79 పోలింగ్ బూతులలో ఓటర్లకు నోటీసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.ఎల్.ఓ.లు, బి.ఎల్.ఎ లతో పాటు కొత్వాల, కార్పొరేటర్ విమలాదేవి లు పాల్గొని ఓటర్లకు వివరాలు తెలిపారు.ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ఓటర్ల నమోదుల సర్ ఫేజ్-2 కీలకమైనదని, బి.ఎల్.ఓ తో పాటు బి.ఎల్.ఏ లు విధిగా పాల్గొని, సమాచారం లేని ఓటర్ల వివరాలు తెలపాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఫారం - 6 ద్వారా ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని కోత్వాల అన్నారు.ఈ కార్యక్రమంలో బి.ఎల్.ఓ లు చందార్కర్, రచ్చా వరుణ్, బి.ఎల్.ఏ లు షేక్ ఖాజమియా, మసనం శరత్, కొత్తగూడెం కార్పొరేషన్ 46 వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలాదేవి, 47 డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి వాసుమల్ల సుందర్ రావు, 46 వ డివిజన్ సిపిఐ ఇంఛార్జి షేక్ అబ్దుల్ రహ్మాన్, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ యాకూబ్, సయ్యద్ కరీం, గడదేశి ప్రభాకర్, బూసి శ్రీను, యాటా నాని, బాబి, గుడపాటి నాగేశ్వరరావు, కట్టా శ్రీను , తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా స్ఫూర్తితో గెలుపోటములను స్వీకరించాలి



ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్





**కొత్తగూడెం ఆర్సీ/పాల్వంచ,ఆగస్టు 30(పోరు తెలంగాణ ప్రతినిధి,జివిరత్నం):** గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఐఏఎస్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉమ్మడి ఖమ్మం జిల్లా ఐటీడీఏ పరిధిలోని గిరిజన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నిర్వహించిన క్రీడా పోటీలు చివరి రోజు కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో ఉత్సాహంగా కొనసాగాయి. జిల్లా క్రీడల అధికారి బి. గోపాల్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, డిప్యూటీ డైరెక్టర్ ముఖతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ గిరిజన ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. గతంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించిన సందర్భాలు అరుదని, ప్రాజెక్టు అధికారి చొరవతో వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల పాల్గొన్న వారు హర్షం వ్యక్తం చేశారు. హోరాహోరీగా సాగిన వాలీబాల్ పోటీల్లో ఏకలవ్య జట్టు విజేతగా, భద్రాచలం జట్టు రన్నర్‌గా నిలిచింది. షటిల్, క్యారమ్స్ పోటీల్లో ఏటిడీఓ దమ్మపేట జట్టు మొదటి స్థానాన్ని, భద్రాచలం జట్టు రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ప్రాజెక్టు అధికారి రాహుల్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏటిడీఓలు ఎస్. చంద్రమోహన్, ఇల్లందు భారతీదేవి, భద్రాచలం రాధమ్మ, కిన్నెరసాని మోడల్ స్పోర్ట్స్ స్కూల్ హెచ్ఎం ఎన్. చందు, పీఈటీలు, పీడీలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## వేల్పూర్ లో పోలీసుల వాహన తనిఖీలు



**పోరు తెలంగాణ : (చాట్ల జితేంద్ర, వేల్పూర్) :** వేల్పూర్ మండల కేంద్రంలోని మోతే గ్రామ శివారు ప్రాంతంలో వేల్పూర్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వారికి,సరైన వాహన పత్రాలు లేని వారికి ఫైన్ విధించారు.ఈ సందర్భంగా ఎస్సై సంజీవ్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపరాదని, తల్లిదండ్రులు మైనర్లకు వాహనం ఇవ్వరాదని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని తెలిపారు

## బేబీ పట్టి వృంధా తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం.




**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి యువకిశోర్ పటాన్చెరు నియోజకవర్గం ఆగస్టు 30 :** పటాన్చెరువు నియోజకవర్గం రామచంద్రపురం మండల్ లోని విద్యుత్ నగర్ ఎం ఐ జి ఫేస్ టు నివాసముంటున్న శివకుమార్ దంపతుల కూతురు పట్టి వృంధా తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించుకుంది. 50 మీటర్ల దూరం రెండు నిమిషాల 18 సెకండ్లు. నడిచి ముందు స్థానంలో నిలిచింది. పది నెలల తొమ్మిది రోజుల పాప వయసు కేటగిరీలో. వరల్డ్ రికార్డ్ ఆఫ్ ద ఫాస్టెస్ట్ టు కవర్ 50 మీటర్స్ బై వాకింగ్ చేసి ఈ రికార్డు సంపాదించింది. తన చిన్నతనంలోనే తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించుకున్నందుకు తల్లిదండ్రులు చాలా ఆనందంలో మునిగిపోయారు.

# తలసేమియా వ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యత





**బాధిత చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన వేడుక**

**సంకల్ప వార్షికోత్సవంలో సీటీసీ అడిషనల్ డీసీపీ ఈ.విజయ్‌బాబు, జీజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్**

**ఖమ్మం, ఆగస్టు 30 :** చిన్నారుల చిరునవ్వుల వెనుక దాగి ఉన్న బాధను గుర్తించడం.. వారి కళ్లలోని కన్నీటిని తుడిచి ఆశల వెలుగులు నింపడం.. రక్తం కోసం ఎదురుచూసే తలసేమియా చిన్నారులకు జీవితంపై భరోసా కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతని, తలసేమియా కేవలం ఒక కుటుంబ సమస్య కాదని, సమాజం మొత్తం స్పందించాల్సిన మానవీయ సమస్య అని సీటీసీ అడిషనల్ డీసీపీ విజయ్ బాబు అన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ 16వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఖమ్మం నగరంలోని కోణార్క్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. సంస్థ ఫౌండర్ అనిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీటీసీ అడిషనల్ డీసీపీ ఈ. విజయ్‌బాబు మాట్లాడుతూ... తలసేమియా వ్యాధి నిర్మూలనకోసం విస్తృత అవగాహనతో సామాజిక ఉద్యమం అవసరం అన్నారు. ఒక్క రక్తపు చుక్క.. ఓ చిన్నారి జీవితానికి ఆశాకిరణం అన్నారు. తలసేమియా వ్యాధి నిర్మూలనకు సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతగా తీసుకొని పనిచేయాలని, బాధిత చిన్నారులకు అండగా నిలిచి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే నిజమైన వేడుక అని అడిషనల్ డీసీపీ విజయ్ బాబు పేర్కొన్నారు. కేవలం వార్షికోత్సవాలు జరుపుకోవడమే కాకుండా, తలసేమియా బాధితుల సంఖ్యను తగ్గించేందుకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సంకల్ప సంస్థ గత 16 ఏళ్లుగా అందిస్తున్న సేవలు మార్గదర్శనీయం అని కొనియాడారు. రక్తం కొరతతో ఏ ఒక్క తలసేమియా చిన్నారి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పోలీస్ శాఖ తరపున ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తున్నామని, భవిష్యత్తులోనూ తమ మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. రక్తదానం చేయడం వల్ల ఒక ప్రాణాన్ని కాపాడవచ్చనే అవగాహనను ప్రతి ఒక్కరిలోనూ పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. తలసేమియా బాధితులకు మెరుగైన జీవనాన్ని, భరోసాన్ని అందించడమే మనందరి ప్రధాన లక్ష్యం కావాలని ఆకాంక్షించారు.

**పిల్లల ఆరోగ్యంతో పాటు ఉన్నత భవిష్యత్తు ముఖ్యం :**

సమాజంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను అధిగమిస్తూ పిల్లలు ఉన్నతమైన భవిష్యత్తును సాధించాలని ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జీజీహెచ్) డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. సొంత కుటుంబ సభ్యుల సమస్యలనే పట్టించుకోలేని వర్తమాన సమాజంలో సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు రవి, అనిత బాధ్యతాయుతంగా 16 ఏండ్లుగా తలసేమియా చిన్నారుల కోసం సేవలు అందించడం గొప్ప విశేషమన్నారు. పిల్లలను సమాజంలో ఇతరులతో సమానంగా చూడాలని, వారి ఆరోగ్యం, భవిష్యత్తు పట్ల సమాజం సానుకూల దృక్పథంతో ముందుకు రావాలన్నారు. పిల్లలతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కిరణ్ కుమార్ తలసేమియా చిన్నారులతో నేరుగా ముచ్చటించి, వారి భవిష్యత్ లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల తమ లక్ష్యాలను సాధించాలని, పూర్తి ధైర్యవంతులుగా ఎదగాలని సూచించారు. ఏఆర్ ఆర్ఐ కామరాజు మాట్లాడుతూ... తలసేమియా చిన్నారులకు ఎప్పుడు రక్తం అవసరమైనా రక్తదానం చేసేందుకు తాము సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇంతటి గొప్ప సేవా కార్యక్రమాలు నిర్వహించే సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థకు సహకారం అందిండం ద్వారా తాము సేవలో భాగం అవుతున్నామని, ఇది మానసిక సంతృప్తినిస్తుందని అన్నారు. అనంతరం రక్తదాతలను, చిన్నారుల కోసం సంస్థకు సహకారం అందిస్తున్న దాతలను ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో చిన్నారులు తమ ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.నారాయణమూర్తి, డాక్టర్ లక్ష్మీదీప, సంస్థ ఉపాధ్యక్షురాలు పి.పావని, ప్రముఖ విద్యావేత్తలు భాగ్య, మమత, సామాజికవేత్త అనురాధ, సంస్థ బాధ్యులు పి.రవిచందర్, పి.ఉదయ్‌భాస్కర్, ఆర్.కస్తూరి, పి.వంశీకిరీటి, సువర్ణకుమారి, ఏఆర్ కానిస్టేబుల్ క్రిష్ణ, ప్రముఖ జర్నలిస్ట్ నెల్లూరి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మండల యాదవ నూతన కమిటీ ఎన్నిక

# అధ్యక్షులు గా వేల్పుల ఐలయ్య యాదవ్

ముఖ్య అతిథి మాజీ జెడ్పిటిసి గంటరాముల యాదవ్



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి :** పెద్దపల్లి జిల్లా ఆగస్టు 30 ఓదెల మండల కేంద్రంలో మారుతి పంక్షన్ హాల్ లొ ఆదివారం అఖిలభారత యాదవ మహాసభ ఉమ్మడి జిల్లా ఎన్నికల సమన్యాయ కర్త మేకల మల్లేశం పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సందనవేనా రాజేందర్ యాదవ్ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులుగా నూతన కమిటీ ఏకగ్రీవంగా వేల్పుల ఐలయ్య యాదవ్ పిట్టల ఎల్లయ్య పల్లి , ఉపాధ్యక్షులుగా బండారి శ్రీనివాస్ యాదవ్ ను ఎన్నుకున్నారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల మాజీ జెడ్పిటిసి గంట రాముల యాదవ్ హాజరైనారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెగడ రమేష్ యాదవ్.వేల్పుల నాగరాజు యాదవ్ యాదవ చరిటేబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గొడుగు రాజాకొమురయ్య యాదవ్ సంఘం మండల అధ్యక్షులు కావటి రాజు యాదవ్ లు ఓదెల మండల యాదవ సంఘం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగినది .పొలం మల్లయ్య యాదవ్.జంగా కనుకయ్య యాదవ్.పొలం మల్లయ్య యాదవ్.మ్యాకల వెంకటేష్ యాదవ్.సింగరావేనా చిన్న ఓదెలు యాదవ్ ఓజ్జె శ్రీనివాస్ యాదవ్ కార్యదర్శులు గా మ్యాకల వెంకటేష్ యాదవ్ ముత్యాల తిరుపతి యాదవ్.మ్యాకల సమ్మయ్య.సహాయ కార్యదర్శి జక్కుల రాజు యాదవ్.గుండేటి ఐలయ్య యాదవ్ .కోశాధికారిగా బండ రాజు యాదవ్.కార్యవర్గ సభ్యులుగా జక్కుల రాజమల్లు యాదవ్.నల్లగషా రాజుయాదవ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు

# మహేశ్వరం లో ఐమాక్స్ లైట్లను ప్రారంభించిన కాకి ఈశ్వర్ ముదిరాజ్



**మహేశ్వరం ఆగస్టు 30, పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి:** మహేశ్వరం నియోజకవర్గం కేంద్రంలో బీరప్ప స్వామి ఆలయం, మహంకాళి మాత ఆలయం, సౌడమ్మ మాత ఆలయ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్చార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్ల ను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకి ఈశ్వర్ ముదిరాజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం పట్టణ శాఖ అధ్యక్షులు బంగారు గాళ్ళ లాజర్, ప్రధాన కార్యదర్శి షేక్ హాజీ బాబా, మహేశ్వరం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అల్లే బిక్షపతి, మహేశ్వరం గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కర్రోళ రాములు ముదిరాజ్, శివగంగ ఆలయ కమిటీ డైరెక్టర్ పోతర్ల తిరుపతయ్య యాదవ్, సీనియర్ నాయకులు గదగూటి జంగయ్య ముదిరాజ్, మహేశ్వరం మండల్ యూత్ కాంగ్రెస్ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ నడికూడా రాకేష్ ముదిరాజ్, మహేశ్వరం గ్రామ వార్డ్ ఇన్చార్జులు గదగూటి మహేందర్ ముదిరాజ్, కాకి మల్లేష్ ముదిరాజ్, యువజన కాంగ్రెస్ నాయకులు ముచింతల శ్రీను కురుమ, గ్రామ పెద్దలు పోల్కం కిష్టయ్య, పోల్కం బాలయ్య, గాజుల శ్రీను, కట్నం బీరప్ప, జోరల అచ్చయ్య, పోల్కం శ్రీశైలం, ఆశన్నగారి మల్లేష్ పాల్గొన్నారు.

# సుస్మీర్‌లో అక్రమ పశు రవాణా పై పోలీసుల ఉక్కు పాదం

ఆరుగురు అరెస్టు, 41 పశువులు స్వాధీనం...



**పోరు తెలంగాణ ఆగస్టు 30: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి** : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలంలోని మహారాష్ట్రలో తక్కువ ధరకు పశువులను కొనుగోలు చేసి జగిత్యాల స్లాటరింగ్ మార్కెట్‌కు తరలిస్తున్నారనే సమాచారంతో ఆగస్టు 29న సాయంత్రం 5:30 గంటలకు సుస్మీర్ గ్రామ శివారులో బెజ్జూర్ ఎస్సై ఎం.డి.సర్తాజ్ పాషా తన సిబ్బందితో దాడి చేశారు. పశువులను తరలిస్తున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 10 ఎద్దులు, 21 ఆవులు, 10 దూడలు కలిపి మొత్తం 41 పశువులను స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలో కొనుగోలు చేసిన పశువులను జగిత్యాల స్లాటరింగ్ మార్కెట్‌లో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. నిందితులపై కేసు నమోదు చేసి, పశువులను పోలీసుల ఆధీనంలో ఉంచారు. తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.

# ఓదెల మండల కేంద్రంలో పి ఎం నరేంద్ర మోదీ 137వ "మన్ కీ బాత్ కార్యక్రమం చరవాణిలో వీక్షించారు



**పోరు తెలంగాణ ఓదెల ప్రతినిధి రవీంద్ర చారి** : పెద్దపల్లి జిల్లా ఆగస్టు 30 ఓదెల మండల కేంద్రంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ 137 వ మన్కి బాత్ కార్యక్రమాన్ని మండల బిజెపి నాయకులు చరవాణిలో వీక్షించారు మన్ కి బాత్ కార్యక్రమంలో నరేంద్ర మోడీ మాట్లాడుతూ దేశ ప్రజల గురించి దేశ సమగ్రత గురించి చాలా చక్కగా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు కారెంగుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఏ ప్రధాని చేయని విధంగా మన దేశం కోసం ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న నరేంద్ర మోడీ కి ప్రత్యేక కృతజ్ఞతలు ఓదెల మండల శాఖ తరపున తెలియజేశారు ఈ కార్యక్రమంలో తీర్థాల కుమారస్వామి, మెరుగు సారంగం, రామినేని రాజేంద్రప్రసాద్, వార్డు సభ్యులు రాచర్ల అశోక్ తదితరులు బిజెపి నాయకులు పాల్గొన్నారు

# నార్లపూర్‌లో పోలీసుల నిఘా.. ప్రజలతో ముఖాముఖి







**కమ్యూనిటీ కాంటాక్ట్‌లో గ్రామ సమస్యలపై ఆరా..**

**40 ద్విచక్ర వాహనాల తనిఖీ...**

**సైబర్ మోసాలు, గుడుంబా, మద్యం, రోడ్డు భద్రతపై అవగాహన....**

**పోరు తెలంగాణ ఆగస్టు 30: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** గ్రామీణ ప్రాంతాల్లో నేరాల నియంత్రణతో పాటు ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంపొందించేందుకు పోలీసు శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీ నార్లపూర్ గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు వాంకిడి పోలీస్ స్టేషన్ సిబ్బంది గ్రామాన్ని సందర్శించి ప్రజలతో నేరుగా మాట్లాడారు. కేవలం నేరాలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తుగా ప్రజలతో మమేకమై సమస్యలను తెలుసుకోవడం, నేరాల నివారణకు ప్రజలను భాగస్వాములను చేయడం కమ్యూనిటీ పోలీసింగ్ ప్రధాన ఉద్దేశమని పోలీసులు వివరించారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు, అనుమానాస్పద వ్యక్తుల సంచారం, అక్రమ కార్యకలాపాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రజల సమస్యలపై ఆరా

గ్రామస్థులతో పోలీసులు ముఖాముఖిగా మాట్లాడి స్థానిక పరిస్థితులపై ఆరా తీశారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉన్నా, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమాచారం అందించే విషయంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, నేరాల నియంత్రణలో ప్రజల సహకారం అత్యంత కీలకమని తెలిపారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, చిన్న సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత పోలీసు అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఒక్క ఫోన్ కాల్‌తో సైబర్ మోసాలకు చెక్

ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు కొత్త రూపాల్లో జరుగుతున్న నేపథ్యంలో గ్రామస్థులను పోలీసులు అప్రమత్తం చేశారు. గుర్తుతెలియని నంబర్ల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం సమాచారం, పిన్, పాస్‌వర్డ్ లేదా ఓటీపీ అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించకూడదని స్పష్టం చేశారు. అత్యవసరమని చెప్పి ఒత్తిడి చేసినా తొందరపడి నిర్ణయం తీసుకోవద్దని, అనుమానం ఉంటే సంబంధిత బ్యాంకు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

యువతపై ప్రత్యేక దృష్టి

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పోలీసులు పిలుపునిచ్చారు. గుడుంబా, అక్రమ మద్యం తదితర అసాంఘిక కార్యకలాపాల వల్ల కుటుంబాలు, సమాజంపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. యువత తమ భవిష్యత్తుపై దృష్టి సారించి విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి వంటి సానుకూల అంశాల వైపు పయనించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదాలకు కారణమవుతుందని, మద్యం మత్తులో వాహనం నడపడం ద్వారా తమతో పాటు ఇతరుల భద్రతను కూడా ప్రమాదంలోకి నెట్టినట్లవుతుందని పోలీసులు హెచ్చరించారు.

హెల్మెట్.. లైసెన్స్ తప్పనిసరి

రోడ్డు భద్రతపై కూడా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనం నడిపేటప్పుడు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం కేవలం జరిమానాల నుంచి తప్పించుకోవడానికి కాదని, ప్రమాదాల నివారణకు అవసరమని వివరించారు. వేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడపకుండా రహదారిపై ఇతర వాహనదారులు, పాదచారుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు.

40 వాహనాలకు తనిఖీ.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో 40 ద్విచక్ర వాహనాలను తనిఖీ చేసి డ్రైవింగ్ లైసెన్స్, వాహన సంబంధిత పత్రాలు తదితర అంశాలను పరిశీలించారు. అవసరమైన పత్రాలు లేని వాహనదారులపై నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు. వాహన తనిఖీల ఉద్దేశం ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం కాదని, రోడ్డు భద్రతను పెంపొందించడం, నిబంధనలపై వాహనదారుల్లో అవగాహన కల్పించడమేనని పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద కదలికలపై వెంటనే సమాచారం


గ్రామంలో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినా, అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసినా ఆలస్యం చేయకుండా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 112 ఎమర్జెన్సీ సేవలను వినియోగించుకోవచ్చని గ్రామస్థులకు వివరించారు. ప్రజలు ఇచ్చే సమాచారం ఆధారంగా అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రజలకు చేరువగా పోలీసింగ్ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం ద్వారా పోలీసులు గ్రామస్థులతో నేరుగా మమేకం కావడంతో పాటు, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ వ్యవస్థపై భరోసా కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు, ప్రజలు కలిసి పనిచేసినప్పుడే నేరాలను మరింత సమర్థవంతంగా నియంత్రించగలమని పేర్కొన్నారు. నార్లపూర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా ఒకవైపు గ్రామస్థుల సమస్యలను తెలుసుకోవడంతో పాటు మరోవైపు సైబర్ నేరాలు, మాదక/చెడు వ్యసనాలు, అక్రమ కార్యకలాపాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ పోలీసులకు సహకరించాలని పోలీసులు కోరారు.

# తెలంగాణ రాష్ట్ర 45వ సబ్-జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ బాలురు డ బాలికల బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2026 ఫైనల్



**పోరు తెలంగాణ న్యూస్ ప్రతినిధి యువ కిషోర్ పటాన్చెరు నియోజకవర్గం ఆగస్టు 30 :** పటాన్చెరువు నియోజకవర్గం రామచంద్రపురం మండల్ ఎంఐజి పేస్ వన్ లో నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర 45వ సబ్ జూనియర్ ఇంటర్ డిస్టిక్స్ బాలురు , బాలికల బాల్ బ్యాట్మెంటన్ ఛాంపియన్షిప్ 2026 ఫైనల్ విజేతగా నిలిచిన బాలికలు మెదక్ డిస్టిక్, బాలురు వరంగల్ డిస్టిక్, విద్యార్థులకు ట్రాఫిని అందజేసిన ఎక్స్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మోహన్ గౌడ్. పటాన్చెరు బి.ఆర్.ఎస్ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి,పటాన్చెరు ఎమ్మెల్యే కంటెస్టెంట్ కాటా సుధారాణి. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సబ్--జూనియర్ బాలురు, బాలికలను ఉద్దేశించి, చదువుతోపాటు ఆటలు కూడా చాలా ముఖ్యమని వారు తెలిపారు, ముఖ్యంగా ఆడపిల్లలకు వారు చురుకుగా ఉండడానికి ఆటలు చాలా మేలు చేస్తాయని స్పోర్ట్స్ లో మంచిగా రానిస్తే వారికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఎక్స్ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ ని ఘనంగా సత్కరించిన, కార్యక్రమ నిర్వహకులు శ్రీనివాసరావు. వారు మాట్లాడుతూ తెలంగాణ పది జిల్లాల నుండి వచ్చిన టీమ్ లకి అన్ని వసతులు సమకూర్చామని. విద్యార్థులు చాలా ఉత్సాహంతో పాల్గొని వారి ప్రతిభ కనబరిచి ట్రాఫిని సొంతం చేసుకున్నారని తెలిపారు.

# అశ్వాపురంలో ఘనంగా మిలాద్-ఉల్ నబి వేడుకలు



పాల్గొన్న ముస్లిం సోదరులు.

అనంతరం భారీ ర్యాలీ ప్రదర్శన.

**అశ్వాపురం: ఆగస్టు 30 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వాపురం మండల కేంద్రంలోని జామా మసీద్ ఆవరణంలో అశ్వాపురం జామా మసీద్ కమిటీ, మిలాద్ ఉన్ నబీ కమిటీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త 1501వ జన్మదినాన్ని పురస్కరించుకొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా (ఫాతియా) ప్రార్థన అనంతరం జామా మసీదు నుండి అంబేద్కర్ సెంటర్ వరకు అక్కడ నుండి గౌతమి నగర్ కాలనీ గేటు వరకు మహమ్మద్ ప్రవక్త నినాదాలతో భారీ ప్రదర్శన ర్యాలీ చేపట్టారు. అనంతరం మత గురువు నసీర్ సుభాని మాట్లాడుతూ, మహమ్మద్ ప్రవక్త సూచించిన సద్ మార్గాలలో ప్రతి ఒక్క ముస్లిం సోదరులు సోదరిమణులు పాటిస్తూ తోటి వారి పట్ల జాలీ,దయ, కనికరంతో ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ, ఆకలితో ఉన్న వారిని వారి ఆకలి బాధను తీరుస్తూ, జీవనం కొనసాగించాలని సూచించారు. సమస్త మానవాళి శాంతి, సౌభాగ్యాలతో, జీవనం కొనసాగించాలని ప్రార్థించారు. తరువాత మండలంలోని ముస్లిం కుటుంబాలకు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మత గురువులు, మత పెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జైనూర్‌లో పులాజీ బాబా 102వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ



**పోరు తెలంగాణ ఆగస్టు 30: కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పట్నాపూర్‌లోని సిద్ధేశ్వర సంస్థాన్‌లో ఆదివారం పులాజీ బాబా 102వ జన్మదిన వేడుకలు జరిగాయి. జిల్లా కలెక్టర్ కె.హరిత, ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యుడు గొడం నగేష్, ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవ లక్ష్మి, ఖానాపూర్ శాసనసభ్యుడు వెడ్మ బొజ్జు పటేల్ పులాజీ బాబా సమాధి మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిద్ధేశ్వర సంస్థాన్ కమిటీ విజ్ఞప్తి మేరకు బాబా మందిర నిర్మాణానికి ఎంపీ కోటా నుంచి రూ.10 లక్షలు మంజూరు చేసేందుకు గొడం నగేష్ కృషి చేస్తానని ప్రకటించారు. ఆలయ పరిసరాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కలెక్టర్ కె.హరిత, ఐటీడీఏ అధికారి మంద మకరందు, ఇరువురు శాసనసభ్యులు సైతం ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ప్రకటించారు. కమిటీ అధ్యక్షులు ఇంగ్లే కేశవ్ దాదా, కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధి, మౌలిక వసతులకు సంబంధించిన వినతి పత్రాలు అందజేశారు. అనంతరం పులాజీ బాబా ఆధ్యాత్మిక సందేశాలు, పాటలతో కూడిన పాటల పుస్తకాన్ని ఆవిష్కరించారు.

## పాట్నాపూర్‌లో పూలాజీబాబా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ



**పోరు తెలంగాణ ఆగస్టు 30: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** కొమురం భీం ఆసిఫాబాద్ నియోజకవర్గం పాట్నాపూర్ గ్రామంలోని శ్రీశ్రీశ్రీ పరమహంస సద్గురు పూలాజీబాబా మఠంలో జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బాబా సమాధి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, జ్యోతి వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, ఎంపీ నగేష్, ఐటీడీఏ పీవో మకరందం, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇంచార్జి అజ్మీర్ శ్యాంనాయక్ తదితరులు హాజరై నివాళులర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## పేరువంచ గ్రామంలో 100 సంవత్సరాల కలను నెరవేర్చిన ఎమ్మెల్యే మట్టా రాగమై దయానంద



**పోరు తెలంగాణ సత్తుపల్లి :-** పేరువంచ గ్రామం లో వందల సంవత్సరాల కల సత్తుపల్లి శాసన సభ్యురాలు శ్రీమతి డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సహకారం తో సర్పంచ్ కీసర నిర్మల మోహన్ రెడ్డి కోరిక మేరకు పాలకవర్గం ఆధ్వర్యంలో ముత్యాలేమ్మా అమ్మవారి గుడికి వెళ్లే దారికి కరెంటు పోల్స్ మరియు లైట్స్ ఏర్పాటు చెయ్యటం జరిగింది. కొన్ని వందల సంవత్సరాలుగా పేరువంచ రైతులు మరియు భక్తుల కి లైట్స్ లేక గుడికి వెళ్ళాలి అనుకున్న, రైతులు పొలాలకి వెళ్ళాలి అనుకున్న ఎన్నో ఇబ్బందులు పడేవారు.. ఈ ఇబ్బందులు అన్ని గమనించిన సర్పంచ్ కీసర నిర్మల మోహన్ రెడ్డి ఈ రోజు కరెంటు పోల్స్ మరియు లైట్స్ ాజు సహకారం తో ఏర్పాటు చెయ్యటం జరిగింది. పేరువంచ గ్రామ ప్రజలు సర్పంచ్ పైన ప్రశంసలు కురిపించటం జరిగింది. ఈ కార్యక్రమం లో సెక్రటరీ ఖ రాజు,పరిమి భరత్, వార్డ్ మెంబెర్ కొండపల్లి మురళి, కోట ఉపేంద్ర,వార్డ్ మెంబెర్ కొనకల్లా తిరుపతి రావు,బడుగు వెంకటేశ్వరావు,గోపాలరావు, మంచాల మాధవరావు,పగడాల నరేష్,కొండపల్లి వంశీ, షేక్ సైదులు,బట్టు రామకృష్ణ,మెంతుల నాగయ్య మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఆపిల్స్‌లో ఎలాంటి విటమిన్లు ఉంటాయో తెలుసా..? ఈ సమస్యలకు మాత్రం రామబాణమే..!




చెప్పాలంటే..ఆపిల్స్ మీ మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అందుకే రోజుకో ఆపిల్ తింటే డాక్టర్‌తో అవసరమే ఉండదని వైద్యులు కూడా చెబుతుంటారు. అలాంటి ఆపిల్‌లో లభించే విటమిన్లు, పోషకాల గురించి మీరు ఎప్పుడైనా ఆలోచించారా..? ఆపిల్స్ ఆరోగ్యానికి, ఫిట్‌నెస్‌కు ఎలా ఉపయోగపడతాయి..? అవన్నీ మనకు ఎందుకు మంచివో ఇప్పుడు చూద్దాం... ఆపిల్.. ఈ చిన్న పండు ఆరోగ్యానికి అమృతాన్నిచ్చే శక్తులను కలిగి ఉందని చెబుతారు. ఆపిల్స్ రుచికరమైనవి మాత్రమే కాదు, వాటి విటమిన్లు, పోషకాలు వాటిని ఆరోగ్య బూస్టర్‌గా చేశాయి. అందుకే రోజుకో ఆపిల్ తింటే డాక్టర్‌తో అవసరమే ఉండదని వైద్యులు కూడా చెబుతుంటారు. అలాంటి ఆపిల్‌లో లభించే విటమిన్లు, పోషకాల గురించి మీరు ఎప్పుడైనా ఆలోచించారా..? ఆపిల్స్ ఆరోగ్యానికి, ఫిట్‌నెస్‌కు ఎలా ఉపయోగపడతాయి..? అవన్నీ మనకు ఎందుకు మంచివో ఇప్పుడు చూద్దాం

**ఆపిల్స్ ఉండే ఉండే ముఖ్యమైన విటమిన్లు:**

ఆపిల్.. మంచి పోషకాలతో కూడిన పండు. ఇందులో వివిధ రకాల విటమిన్లు ఉంటాయి. ఆపిల్స్‌లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. అదనంగా , ఆపిల్స్‌లో విటమిన్ ఎ, విటమిన్ ఇ , విటమిన్ కె, విటమిన్ బి కాంప్లెక్స్ కూడా ఉంటాయి.???

**21రోజులు క్రమం తప్పకుండా కొబ్బరి నీళ్లు తాగితే శరీరంలో జరిగేదిఇదే**

ఆపిల్స్‌లోని యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ గుండె ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. యాపిల్స్‌ను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. బరువు తగ్గడం నుండి మధుమేహం వరకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆపిల్స్ లో కేలరీలు తక్కువగా, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఇవి బరువు తగ్గడానికి సహాయపడతాయి. ఆపిల్స్ తినడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండి ఉంటుంది. అనవసరంగా తినడం తగ్గుతుంది. ఇంకా, ఆపిల్స్ లో పాలీఫెనాల్స్, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి .

# సరండిలో ఘనంగా 102వ జయంతి వేడుకలు

ఆధ్యాత్మిక చైతన్యానికి నాంది....

మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం.....

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలనే సందేశం....





**పోరు తెలంగాణ ఆగస్టు 30: కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి :** ఆధ్యాత్మికతతో పాటు మానవతా విలువలను ప్రజల్లో పెంపొందించేందుకు శ్రీశ్రీశ్రీ పరమహంస సద్గురు పూలాజీ బాబా చేసిన కృషిని స్మరించుకుంటూ వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీ పరిధిలోని సరండి గ్రామంలోని బాబా ధ్యాన కేంద్ర మందిరంలో 102వ జయంతి వేడుకలను భక్తులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. సరండి గ్రామంలోని శ్రీశ్రీశ్రీ పరమహంస సద్గురు పూలాజీ బాబా ధ్యాన కేంద్రం మందిరం వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. జయంతి సందర్భంగా ధ్యాన కేంద్రం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. బాబా బోధనలు, ఆధ్యాత్మిక సేవలను స్మరించుకుంటూ భక్తులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పూలాజీ బాబా చూపిన మార్గం, ఆయన ప్రజలకు అందించిన సందేశాలు, సమాజంలో తీసుకువచ్చిన మార్పు వంటి అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి.జయంతి వేడుకలతో సరండి గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమం గ్రామ ప్రజలను, ముఖ్యంగా చిన్నారులను భక్తి మార్గం వైపు ఆకర్షించేలా సాగింది. పూలాజీ బాబా జయంతిని ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ ఆయన సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో కూడా ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో మరిన్ని ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# నిన్నటి ఉద్రిక్తతకు నేడు తెర ప్రశాంతంగా మౌలానా అంత్యక్రియలు

పోలీసుల పటిష్ఠ బందోబస్తు.. సంయమనం పాటించిన గ్రామ ప్రజలు



**బూర్గంపాడు ఆగస్టు 30 పోరు తెలంగాణ జిల్లా ప్రతినిధి కూరపాటి దాసు :** నిన్నటి ఉద్రిక్తతకు ఆదివారం నాడు తెరపడింది. ఓ కుటుంబాన్ని విషాదంలో ముంచిన మౌలానా మృతి గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపినా.. మరోసారి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా గ్రామ ప్రజలు సంయమనం పాటించారు. పోలీసుల పటిష్ఠ బందోబస్తు, గ్రామ ప్రజల సహకారంతో షేక్ మౌలానా అంత్యక్రియలు ఆదివారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. కారు ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన మౌలానా ఖమ్మంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. భార్య, పిల్లలు, బంధువుల రోదనలు అక్కడి వారిని కంటతడి పెట్టించాయి.

**విషాదం మధ్య.. సంయమనం**

మౌలానా మృతదేహం గ్రామానికి చేరుకున్న సమయంలో భారీగా బంధువులు, గ్రామ ప్రజలు తరలివచ్చారు. నిన్నటి పరిణామాలను దృష్టిలో ఉంచుకున్న పాల్వంచ డిఎస్పి ఆధ్వర్యంలో ముందస్తుగా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. పరిస్థితి అదుపు తప్పకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించారు. అయితే ఈసారి గ్రామ ప్రజలు సంయమనం పాటించారు. ఒక ప్రాణం పోయింది.. మరో ప్రాణం పోకుండా, మరో కుటుంబం రోడ్డున పడకుండా చూడాలి అన్న భావనతో శాంతియుతంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు సహకరించారు.

**పోలీసుల అప్రమత్తత.. ప్రజల సహకారం**

గ్రామంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా పోలీసులు అడుగడుగునా అప్రమత్తంగా వ్యవహరించారు. ముఖ్య ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేసి, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. పోలీసుల సూచనలకు గ్రామ ప్రజలు కూడా సహకరించడంతో ఎలాంటి గొడవలు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదు.

**శాంతియుతంగా ముగిసిన అంతిమయాత్ర**

మౌలానా అంతిమయాత్రలో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. కన్నీటి పర్యంతమైన వాతావరణంలో అంతిమయాత్ర కొనసాగగా.. పోలీసులు భద్రత కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అంత్యక్రియలు ప్రశాంతంగా ముగిశాయి. నిన్నటి ఉద్రిక్త పరిస్థితుల అనంతరం నేడు గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొనడం అందరికీ ఊరటనిచ్చింది. విషాదాన్ని విషాదంగానే ఉంచి.. వివాదానికి తావివ్వకుండా గ్రామ ప్రజలు చూపిన సంయమనం అభినందనీయం.

**మౌలానా మృతి ఓ కుటుంబానికి తీరని లోటు..**

కానీ ఆయన అంత్యక్రియలు ప్రశాంతంగా జరగడం గ్రామానికి శాంతి సందేశంగా నిలిచింది. మౌలానా కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని బంధువులు కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా ప్రాధేయపడ్డారు. మౌలానా కుటుంబానికి న్యాయం జరిగేలా బంధువులు కుటుంబ సభ్యులు పోరాటం చేసే కన్నీటి వీడ్కోలు పలికారు వేచి చూడాలి మౌలానా కుటుంబానికి ఎంతవరకు న్యాయం జరిగిద్ది జరుగుతుందని ప్రజలు ఉత్కంఠంగా వేచి చేస్తున్నారు.

# అశ్వగంధ ఆకులు వాడుతున్నారా ఆయుర్వేద మూలికపై వచ్చిన కొత్త రూల్స్ గురించి తెలుసా

తాజా అడ్వైజరీ ప్రకారం, హెల్త్ సప్లిమెంట్లు, ఇతర ఆహార ఉత్పత్తులలో కేవలం అశ్వగంధ వేర్లు, వాటి నుంచి తీసిన సారాన్ని మాత్రమే వాడాలి. కొన్ని కంపెనీలు అశ్వగంధ ఆకులను కూడా పొడి రూపంలోనో లేదా ఇతర రూపాల్లోనో వాడుతున్నట్లు గుర్తించిన అధికారులు, ఇది నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. అశ్వగంధ ఆయుర్వేదంలో దీనికి ఉన్న ప్రత్యేకత గురించి మనందరికీ తెలిసిందే. నేటి ఆధునిక కాలంలో ఒత్తిడిని తగ్గించుకోవడానికి, మంచి నిద్ర కోసం ప్రపంచవ్యాప్తంగా చాలామంది అశ్వగంధ సప్లిమెంట్లను వాడుతున్నారు. అయితే, పెరుగుతున్న డిమాండ్‌ను ఆసరాగా చేసుకుని కొన్ని కంపెనీలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భారత ఆహార భద్రత మరియు ప్రమాణాల అధికారం (ఖీూూూ×) కీలకమైన హెచ్చరికను జారీ చేసింది. అశ్వగంధ ఉత్పత్తుల తయారీలో ఏ భాగాలను వాడాలో స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది.

**ఆకులు ఎందుకు వాడకూడదు:** అశ్వగంధ వేర్లు శతాబ్దాలుగా ఆయుర్వేదంలో ఔషధంగా వాడుకలో ఉన్నాయి. కానీ ఆకులు, కాడలు, పండ్లు తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆకుల్లో ఆల్కలాయిడ్స్ ఎక్కువగా ఉంటాయి, ఇవి మన జీర్ణవ్యవస్థను దెబ్బతీయడమే కాకుండా కాలేయంపై విషప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే ప్రభుత్వం అశ్వగంధ ఆకుల వాడకంపై నిషేధం విధించింది. కంపెనీలు తమ ఉత్పత్తుల ప్యాకెట్ల మీద ఏ భాగాన్ని వాడారో స్పష్టంగా పేర్కొనాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆదేశించింది. చాలా బ్రాండ్లు కేవలం 'అశ్వగంధ' అని మాత్రమే రాస్తున్నాయని, ఇది వినియోగదారులను అయోమయానికి గురిచేస్తుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**మోతాదు మించితే ముప్పే!:** అశ్వగంధ ఔషధ గుణాలు కలిగిన మూలిక కాబట్టి, దానిని ఆహారంలా ఎంతపడితే అంత తీసుకోకూడదు. సాధారణంగా రోజుకు 300 నుండి 600 మి.గ్రా మోతాదు మాత్రమే సురక్షితమని డైటీషియన్లు సూచిస్తున్నారు. ఒకవేళ 1000 మి.గ్రా కంటే ఎక్కువ మోతాదు తీసుకుంటే వికారం, డయేరియా వంటి జీర్ణకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. మరీ ముఖ్యంగా థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు, గర్భిణీలు, పాలిచ్చే తల్లులు మరియు ఇతర మందులు వాడుతున్న వారు అశ్వగంధను వైద్యుల సలహా లేకుండా అస్సలు వాడకూడదు. మీరు ఏదైనా అశ్వగంధ సప్లిమెంట్‌ను కొనేటప్పుడు అది వేర్లతో తయారైందా లేదా అనేది ఖచ్చితంగా గమనించండి. ఏ ఆరోగ్య ప్రయోజనం కోసమైనా దీనిని 8 నుండి 12 వారాల కంటే ఎక్కువ కాలం వాడకూడదు. సరైన జాగ్రత్తలు పాటించి ప్రకృతి అందించిన ఈ మూలికతో ఆరోగ్యాన్ని పదిలపరుచుకోండి.

# ఈ సీజన్‌లో హెర్బల్ టీలను తాగడం మరిచిపోకండి.. ఇవి చేసే మేలు అంతా ఇంతా కాదు..



వర్షాకాలంలో సహజంగానే అందరికీ అనేక రకాల అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ దగ్గు, జలుబు, జ్వరం వంటి రోగాల బారిన పడుతుంటారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈ వ్యాధులు త్వరగా అటాక్ అవుతుంటాయి. పైగా వారికి ఇవి ఒక పట్టాన తగ్గవు. కనుక రోగ నిరోధక శక్తిని పెంచుకోవాల్సిన అవసరం ఉంది. అందుకు గాను పలు హెర్బల్ టీలు మనకు ఎంతగానో ఉపయోగపడతాయి. వర్షాకాలంలో హెర్బల్ టీలను సేవించడం వల్ల ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఆయుర్వేద ప్రకారం ఈ టీ లు మనకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తాయి. జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తాయి. నీరు, గాలి, ఆహారం కాలుష్యం వల్ల వచ్చే ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. అలాగే బద్దకం నుంచి బయట పడవచ్చు. యాక్టివ్‌గా మారుతారు. ఉత్సాహంగా ఉంటారు. ఇక అందుకు ఏయే హెర్బల్ టీ లు ఎలా పనిచేస్తాయో ఇప్పుడు తెలుసుకుందాం.

ఏయే టీలను తాగాలంటే..

అల్లం, తులసి చాలా మంది ఇళ్లలో ఉంటాయి. ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. చిన్న అల్లం ముక్కను, కొన్ని తులసి ఆకులను కొన్ని నీళ్లలో వేసి మరిగించి వడకట్టి ఆ నీళ్లను గోరు వెచ్చగా ఉండగా తాగేయాలి. రుచి కోసం అందులో అవసరం అనుకుంటే కాస్త నిమ్మరసం, తేనెను కలపవచ్చు. పసుపు టీ కూడా మనకు ఎంతో మేలు చేస్తుంది. కొన్ని నీటిలో కొద్దిగా పసుపు, తురిమిన అల్లం, నల్ల మిరియాల పొడి వేసి బాగా మరిగించి అనంతరం ఆ నీళ్లను వడకట్టి గోరు వెచ్చగా ఉండగానే తాగేయాలి. అలాగే వాము గింజలు, సోంపు గింజలను నీటిలో వేసి మరిగించి తాగుతున్నా ఉపయోగం ఉంటుంది. లెమన్ గ్రాస్, కొన్ని పుదీనా ఆకులను నీటిలో వేసి మరిగించి తాగవచ్చు. దాల్చిన చెక్క పొడి లేదా ముక్కలను నీటిలో వేసి మరిగించి తాగుతున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ఇలా పలు రకాల హెర్బల్ టీలను మీరు మీ ఇంట్లోనే తయారు చేసి తాగవచ్చు. వీటితో అనేక లాభాలను పొందవచ్చు.

రోగ నిరోధక వ్యవస్థకు..

హెర్బల్ టీలను ఇంట్లో తయారు చేసి తాగడం వల్ల శరీర రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. దగ్గు, జలుబు, జ్వరం నుంచి ఉపశమనం లభిస్తుంది. అల్లం, తులసి, పసుపు వంటి పదార్థాల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శక్తివంతమైన యాంటీ మైక్రోబియల్ గుణాలను కలిగి ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మార్చి ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. హెర్బల్ టీలను సేవించడం వల్ల మెటబాలిజం మెరుగు పడుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. దీని వల్ల అజీర్తి తగ్గుతుంది. అల్లం, పుదీనా, వాము, సోంపు గింజల్లో ఉండే సమ్మేళనాలు కార్మినేటివ్ గుణాలను కలిగి ఉంటాయి. కనుక జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. గ్యాస్, అజీర్తి వంటి సమస్యలు తగ్గిపోతాయి. ఆకలి పెరుగుతుంది. ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది.

కీళ్ల నొప్పులు, వాపులకు..

హెర్బల్ టీలను సేవించడం వల్ల కీళ్ల నొప్పులు, వాపులు, ఒళ్లు నొప్పుల నుంచి బయట పడవచ్చు. శరీరంలోని వాపులు తగ్గిపోతాయి. పసుపు, అల్లం, దాల్చిన చెక్కలలో శక్తివంతమైన యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి ఒళ్లు నొప్పులను తగ్గించి వాపుల నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. హెర్బల్ టీలను సేవిస్తుంటే శరీరం డిటాక్స్ అవుతుంది. శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లిపోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. ముఖ్యంగా కిడ్నీలు, లివర్ క్లీన్ అయి ఆరోగ్యంగా ఉంటాయి. ఇందుకు లెమన్ గ్రాస్ టీ చక్కగా పనిచేస్తుంది. దీన్ని సేవిస్తుంటే లివర్, కిడ్నీలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. హెర్బల్ టీలను సేవించడం వల్ల ఒత్తిడి, ఆందోళ సైతం తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. దీంతో రాత్రి పూట చక్కగా నిద్ర పడుతుంది. పడుకున్న వెంటనే గాఢ నిద్రలోకి జారుకుంటారు. నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. ఇలా వర్షాకాలంలో హెర్బల్ టీలను సేవించడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

## కానా ల కాదు కగార్!



పచ్చని బాటలో చేతగాని ఆటలు..
చెత్తబుట్టల కథలు..
'చేదు నిజాల'ను అణగదొక్కుడు..
అడవి తల్లిని కుదువపెట్టుడు..
ఆకలి కడుపులల్ల మేకులు దించుడు..
ఒప్పదిది.. ఒప్పదు..!
సాంకేతిక ఆధారమట
డ్రోన్ల క్లిక్కులట
శాటిలైట్ చిత్రమట
కారడవిల బూట్ల సప్పుడట
దాని పేరు 'కగార్' అట..!
ప్రశ్నలొద్దటజి
జవాబే లేదట..
చర్చలొద్దటజి
తూటాలే పొడిసేటి పొద్దట..
ధర్మం, అధర్మమేదో
'కర్మ'కు తెలుసట..!
ఢిల్లీ దోపిడీ ఒడిసి
ఒర్రెల సూపు వడ్డది
నేలమ్మ గర్భమొకటే ఉన్నది
'కుటిల నీతి' కుతంత్రమిది
'పగటి కలల' పాపమిది..!
శత్రు గుండెల్లో 'సింధూర్' నాదమట
కోరితే 'శతఘ్నుల మౌనమట'
అవినీతికే అధిక గౌరవమట
అన్నలు నేలకొరిగితే అప్పగించరట
ఆత్మఘోషలే ఆఖరి చూపులట
ఒప్పదంటే ఒప్పదిది..!
డబ్బు ఆకలి నచ్చని ఊరిలో..
అణచివేత నడిచే దారిలో..
కులమతాల కలుషిత వీధిలో..
వేగుచుక్కలై పుడతరు
మండే కడుపున మళ్లా
ఉదయిస్తరు.. ప్రశ్నిస్తరు..!
ఎర్ర పూలకు ఎదురుకాల్పులు
'దంతెవాడ'ను పంటి బిగువున దాసుకున్నది
'మానాల'ను మదిల పెట్టుకున్నది
పాణాలను మింగే హక్కెక్కడిదన్నది
కర్రెగుట్టల దేరాల జూసి
కడుపుల పేగు కదులుతున్నది..
కొమ్మ సాటున యెక్కి యెక్కి ఏడ్సినది
కండ్లెర్రవడి అడుగుతున్నది ఈ నేలతల్లి..
కగార్ 'కానా'ల కాదని
అవినీతి గుండెల్ల వెట్టమని

## నా అడుగులటువైపే



ఆకుపచ్చని తనాలను కోరుకుంటే
కాంక్రీట్ శిథిల దృశ్యాలు
దర్శనమిస్తున్నాయిజి
శ్రమైకజీవన సౌందర్యాలను
వీక్షించాలనుకుంటే
కొత్త కొత్త వైరస్ దాడులు వికృతంగా
వికటాట్టహాసం చేస్తున్నాయి
పచ్చని పంట పొలాలు చూడాలనుకుంటే
ఎడారి భూములు వెక్కిరిస్తున్నాయి
ఛిద్రమైన వలస బ్రతుకులు
చిగురించని కొత్త చిగుళ్లు
చదువులమ్మ తల్లి ఒడిలో బడిలో
గురువుల నీడలో చదువుకుందామంటే
పాఠశాల ప్రాంగణాలన్నీ
తాగుబోతుల నిలయాలై
పరిహసిస్తున్నాయిజి
జలధారలతో పుడమి పులకిస్తుందనుకుంటే
కన్నీటి ధారలు వరదలై చెలరేగుతున్నాయి
ప్రస్తుత ధరిత్రి చరిత్ర పఠిస్తుంటే
ప్రతి పూటలోనూ యుద్ధభేరి నినాద నాద
శబ్ద తరంగాలే ధ్వనిస్తున్నాయి
ఇప్పుడు ఉదయాలు కరువై
అంధకారంలో హృదయాలు అలమటిస్తున్నాయి
ఉరుకులు పరుగులతో పడమటి పయనాలు
డాలర్లతో తూకమేసుకుంటున్న జన ప్రవాహాలు
ఏవేవో మస్తిష్కంలో దూరి
విస్ఫోటనం చెందుతూ
నిన్నటి బంధాలను బంధుత్వాన్ని
స్నేహ వారధుల్ని
లోలోపల గాయాలు చేస్తూ
నిలువునా కూల్చేస్తున్నాయి
కదిలే కాలాన్ని ఇదేమని ప్రశ్నిస్తే
ప్రపంచాన్ని యుద్ధమేఘాలు కమ్ముకున్న కాలమని
మానవ బంధాలు మృగ్యమని సెలవిస్తోంది
ఇప్పుడు నాకు నవ్యత్వం కావాలి
నవ్యత్వం అంటే
మానవత్వం పరిమళించే దిశగా
సమాజ గమనం సాగాలి
నా అడుగులటువైపే

# చెరగని కవితా ఝరి



తెలుగు కవిత సృజన ప్రపంచంలోకి ఎన్.అరుణ 'మౌనమూ మాట్లాడుతుంది' అనే కవితా సంపుటితో ప్రవేశించడం నాటి సాహితీ లోకంలో ఒక ఆశ్చర్యం. విద్యార్థి దశలోనే సాహితీ సృజన చేసినా కుటుంబ బాధ్యతలకు అంకితమై నిశబ్దంగా ఉన్న అరుణ ఒక్కసారిగా కవిత్వాన్ని వెల్లువలా సృష్టించి వ చన కవితా చరిత్రలో తనదైన స్థానాన్ని అందుకున్నారు. అగ్నిపర్వతం బద్దలైతే ప్రమాదకరమైన లావా వెలువడుతుంది. అరుణ హృదయం బద్దలై కవిత్వ పరిమళ ప్రవాహం లోకాన్ని ముంచెత్తింది. మౌనం కొత్త వర్ణమాలను సృష్టించుకొని, సరికొత్త వ్యాకరణాన్ని అల్లుకొని మాట్లాడిన మాటలు పాఠకలోకంలో వినూత్న అనుభూతులను, ఆలోచనలను ఆవిష్కరించాయి.

'నన్ను నేనెప్పుడూ వెతుక్కుంటూనే ఉంటాను/ మనస్సు నిండా చిన్న చిన్న శూన్యాలుంటాయి/ ఆ శూన్యాలకు భాష్యమే మౌనం'

అంటూ అరుణ మానవ లోకంలో అలుముకున్న శూన్యానికి తాత్విక కవితా భాష్యాన్ని పునర్‌లిఖించారు.

లౌకిక వ్యవహారాలను వదిలించుకొని, జీవిత రహస్యాలని అవగతం చేసుకొని, కాలం చేసే మార్మికతలను ఛేదించుకొని పరిణత మనసుతో నిండిన వ్యక్తిత్వంతో జీవన సౌందర్యాన్వేషణలో ఒక్కొక్కరు ఒక్కో తీరానికి చేరుకుంటారు. సృజనాత్మకశీలి అరుణ కూడా కవితాత్మక తీరానికి ఆలస్యంగానైనా చేరుకోవడం సహజమైన పరిణామమే. 'లోకానికి అక్షరాలు అప్పుపడ్డాను/ అందుకే కవిత్వం రాస్తున్నా', 'ఋణశేషం నాకిష్టం లేని పని/ అందుకే నన్ను నేను అక్షరంగా మలచుకుంటున్నా'నంటూ విశిష్టమైన వస్తుశిల్పాలతో బలమైన వచన కవితా స్వరంగా శాశ్వత స్థానాన్ని పొందిన కవయిత్రి అరుణ. దశాబ్ద కాలంలో ఎనిమిది కవితా సంపుటాలు సృజించటం సామాన్యమైన విషయం కాదు. 'మౌనమూ మాట్లాడుతుంది'తో మొదలైన కవితాపథం 'పాటల చెట్టు'గా మారి గుప్పెడు గింజల్ని వెదజల్లుతూ 'అమ్మ ఒక మనిషి' అని నిరూపిస్తూ 'హృదయమే వదనం'గా ఆవిష్కృతమై 'సూది నా జీవన సూత్రం' అంటూ తన కవిత్వంలోని అంతస్సూత్రాలను ప్రకటిస్తూ 'కొన్ని తీగలు కొన్ని రాగాలు'గా తన కవితా స్వరాన్ని పాఠక హృదయాల్లో ప్రతిధ్వనించేలా పలకరించారు. బంగారం అనే ఒక లోహంపై ఈ మనుషుల మోహాన్ని ఎంత ఘాటుగా విమర్శించారో చూడండి.'ఇది స్త్రీ హృదయ సౌందర్యాన్ని/ కప్పేసే కాలమేఘం భావనలను గాయపరిచే/ కన్నీటి లోహం/ ఇది మగవాడి ప్రేమ కాదు/రసికత ఇచ్చే కానుక /ఆడదాని బానిసత్వానికి ప్రతీక' అంటూ నలుగురిలోకి వెళ్లినప్పుడు వ్యక్తి సంస్కారాన్ని, జ్ఞానాన్ని కొలమానాలుగా కాకుండా కేవలం లోహాభరణాలతో విలువ కట్టే సమాజంలో బంగారం ధర విపరీతంగా పెరిగితేనన్నా అది జీవితాల్లోంచి అదృశ్యమై మనిషి విలువ తెలుస్తుందని కవయిత్రి ఆకాంక్షించారు. ఆమె ఆకాంక్ష బలపడుతున్న సందర్భంలో అరుణ అదృశ్యమైపోవడం తీరని విషాదం. కవిత్వం-వ్యక్తిత్వం రెండూ తూర్పు పడమరల్లా వేర్వేరుగా ఉన్న కాలంలో అరుణ వ్యక్తిత్వం కవిత్వంలో ఉషోదయమంత వాస్తవికంగా దార్శనికతతో వ్యక్తమవడం విశేషం. అరుణ అమ్మ 'ఒక మనిషి' వారి కవితా దృక్పథానికి ప్రతీక. అమ్మను లేదా స్త్రీని అక్షరాల్లో ఆకాశమంత ఎత్తుకు వర్ణిస్తూ ఆమె ఒక మహాకావ్యమని ప్రశంసించే లోకానికి తీవ్రమైన హెచ్చరిక చేస్తారు. 'అమ్మ గురించి/ కవిత్వం రాయకండి మిత్రులారా!' అని వారిస్తూ 'గోరుముద్దలు గుర్తున్నాయి గాని/ ఇవ్వాళ ఆమెకో ముద్దపడేస్తున్నారా?' అని సూటిగా ప్రశ్నిస్తారు. అందుకే 'అమ్మను/ దేవతను చేయకండి మిత్రులారా/ మనిషిగా గుర్తిస్తే చాలు' అంటారు. అరుణ వాక్యం వారి లాగానే నిరాడంబరంగా వెలిగిపోయింది. వస్తువేదైనా దాన్ని కవిత్వంతో నింపారు. మూలాలను మరిచిపోకుండా తనను తాను అక్షరాల్లోకి అనువదించుకొని సాంత్వన పొందారు. అందువల్లే వారి కవితాక్షరాలు తామరాకు మీద నీటిబొట్టులా తాత్వికంగా పలకరించాయి. అంతలోనే అవి మన మనసులోకి జారిపడి ముత్యాల్లా మారిపోయి మిల మిలలాడుతూ జీవిత అర్థాలను విప్పి చెప్పాయి. అందుకే, అరుణ విశ్రాంత వర్గ కవి కాదు. 'వచ్చేటప్పుడు ఏం వెంట తెచ్చానో తెలియదు/ పోయేటప్పుడు ఏం తీసుకెళ్తానో కూడా తెలియదు/ ఈ అనుభవాలు, జ్ఞాపకాలే కదా జీవితం' అంటూ అరుణ సాహితీ అభిమానుల్లో ఒక చెరగని కవితా జ్ఞాపకంగా నిత్యం వెలుగులీనుతుంటారు.o

# కాళ్లు లేదా పాదాలు విపరీతమైన నొప్పిగా ఉన్నాయా..?
## అయితే ఈ చిట్కాలను పాటించండి..!

శారీరక శ్రమ లేదా వ్యాయామం అధికంగా చేసినప్పుడు, వాకింగ్, రన్నింగ్ ఎక్కువ సేపు చేసినా, లేదా పలు ఇతర కారణాల వల్ల కూడా మనకకు అప్పుడప్పుడు కాళ్ల నొప్పులు వస్తుంటాయి. సాధారణంగా ఒక రోజు విశ్రాంతి తీసుకుంటే ఈ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అయితే కొందరికి కాళ్ల నొప్పులు అంత త్వరగా తగ్గవు. పైగా పోషకాహార లోపం, అసౌకర్యవంతమైన పాదరక్షలను ధరించడం, ఆర్థరైటిస్, అధికంగా బరువు ఉండడం వంటి సమస్యలు ఉన్నవారికి కాళ్ల నొప్పులు వస్తే ఇంకా ఎక్కువ ఇబ్బంది కలుగుతుంది. అయితే ఈ నొప్పులు తగ్గేందుకు ఇంగ్లిష్ మెడిసిన్‌ను వాడాల్సిన పనిలేదు. మన ఇంట్లో ఉండే పలు పదార్థాలతోనే సహజసిద్ధంగా ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. అందుకు గాను పలు చిట్కాలను పాటించాల్సి ఉంటుంది.

### ఎప్సం సాల్ట్, నీలగిరి తైలం..

ఒక బకెట్‌లో సగం వరకు గోరు వెచ్చని నీళ్లను తీసుకుని అందులో కాస్త ఎప్సం సాల్ట్‌ను వేసి కలిపి ఆ బకెట్‌లో కాళ్లను ముంచి ఉంచాలి. ఇలా 15 నిమిషాల పాటు ఉంచితే నొప్పుల నుంచి త్వరగా ఉపశమనం లభిస్తుంది. అలాగే వేడి నీటిలో టవల్‌ను ముంచి దాంతో కాపడం పెడుతున్నా కూడా నొప్పులు తగ్గిపోతాయి. కాళ్లు లేదా పాదాల నొప్పులను తగ్గించేందుకు నీలగిరి తైలం బాగా పనిచేస్తుంది. ఇందులో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభించేలా చేస్తాయి. ఒక బకెట్ లో వేడి నీటిని పోసి అందులో కొద్దిగా నీలగిరి తైలం వేయాలి. అనంతరం అందులో కాళ్ళను ఉంచాలి. మోకాళ్ళ వరకు కాళ్ళను బకెట్ లో ముంచి ఉంచాలి. 15 నిమిషాల పాటు కాళ్ళను అలా ఉంచితే కాళ్ళ నొప్పులు తగ్గుతయి. తర్వాత కాళ్ళను బయటికి తీసి సాధారణ నీటితో కడుక్కోవాలి. దీంతో కాళ్ళ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.



### పుదీనా టీ, మెంతుల నీళ్లు..

నీలగిరి తైలంకు బదులుగా యాపిల్ సైడర్ వెనిగర్‌ను కూడా ఉయోగించవచ్చు. దీంతో కూడా కాళ్ల నొప్పులను తగ్గించుకోవచ్చు. ఇక నొప్పి ఉన్న ప్రదేశంపై మంచు ముక్కలు ఉండే ఐస్ ప్యాక్‌తోనూ కాపడం పెట్టినట్లు పెట్టాలి. కొద్ది నిమిషాల పాటు మర్దనా చేసినట్లు ఐస్ ప్యాక్‌ను రాయాలి. దీంతో రక్త సరఫరా మెరుగు పడుతుంది. వాపులు తగ్గుతాయి. కాళ్ల నొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు. పుదీనా ఆకులతో టీ తయారు చేసుకుని తాగడం వల్ల కూడా కాళ్ల నొప్పులను తగ్గించుకోవచ్చు. ఈ ఆకుల్లో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. అలాగే రెండు గ్లాసుల నీటిని తీసుకుని అందులో ఒక టేబుల్ స్పూన్ మెంతులను రాత్రిపూట నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయాన్నే పరగడుపునే ఆ నీటిని తాగాలి. మెంతుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు నొప్పులను తగ్గిస్తాయి.

### విటమిన్ డి ఆహారాలు..

విటమిన్ డి లోపం ఉన్నవారిలోనూ కాళ్లు లేదా కండరాలు నొప్పులకు గురవుతుంటాయి. కనుక విటమిన్ డి ఉండే ఆహారాలను తింటున్నా కూడా ఈ సమస్య తగ్గుతుంది. విటమిన్ డి మనకు ఎక్కువగా చేపలు, మాంసం, కోడిగుడ్డు పచ్చ సొన, తృణ ధాన్యాలు, పుట్ట గొడుగులు, సోయా మిల్క్, ఓట్ మీల్ వంటి ఆహారాలలో లభిస్తుంది. అలాగే నిత్యం ఉదయాన్నే కొంత సేపు సూర్యరశ్మిలో నిలబడాలి. దీంతో కూడా మనకు విటమిన్ డి లభిస్తుంది. ఇలా పలు చిట్కాలను పాటిస్తూ ఆయా ఆహారాలను తింటుంటే కాళ్లు, పాదాల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి.

# ట్రంప్ ప్రసంగాన్ని అడ్డుకున్న హమాస్ మద్దతుదారులు.. వీడియో



ఇజ్రాయిల్ పార్లమెంట్ కెనెసెట్‌లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్(ప్రసంగిస్తున్న సమయంలో కొందరు సభ్యులు అడ్డుకున్నారు. ట్రంప్ ప్రసంగం ప్రారంభించిన అయిదు నిమిషాల్లోనే హమాస్‌కు మద్దతు పలుకుతూ ఇద్దరు సభ్యులు నినాదాలు చేశారు. దీంతో అక్కడ ఉన్న సిబ్బంది ఆ ఇద్దరు కెనెసెట్ సభ్యులను బయటకు లాక్కెళ్లారు. ఆ సమయంలో కాసేపు ట్రంప్ తన ప్రసంగాన్ని ఆపారు. చాలా సమర్థవంతంగా భద్రతా సిబ్బంది వ్యవహరించినట్లు ఆ ఘటన తర్వాత ట్రంప్ అన్నారు. మిడిల్ ఈస్ట్‌లో ఇది చరిత్రాత్మకమైన కొత్త ఆరంభం అన్నారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమన్ నెతన్యహూకు ఆయన థ్యాంక్స్ తెలిపారు. నెతన్యహూ ధైర్యం అసామాన్యమైందన్నారు. చర్చలకు సహకరించిన అరబ్ దేశాలకు కూడా ట్రంప్ థ్యాంక్స్ చెప్పారు. ఇదొక అద్భుత విజయం అన్నారు. ఇక ఇజ్రాయిల్‌లో స్వర్ణయుగం మొదలైందని, యావత్ ప్రాంతానికే ఇది స్వర్ణ యుగమన్నారు.

ఇజ్రాయిల్ ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యుడు ట్రంప్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. పాలస్తీనాను గుర్తించండి అంటూ ఆయన ఓ ప్లకార్డు పట్టుకున్నారు. సభను ఆర్డర్‌లో పెట్టాలని ఆ సమయంలో స్పీకర్ ఆమిర్ ఓహనా గట్టిగా అరిచారు. నిరసన వ్యక్తం చేస్తున్న ప్రతిపక్ష ఎంకే సభ్యుడిపై స్పీకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు రెండేళ్ల పాటు హమాస్ చెరలో ఉన్న 20 మంది బంధీలు ఇవాళ ఇజ్రాయిల్ చేరుకున్నారు. ఆయుధాల వల్లే శాంతి వెలిసినట్లు ట్రంప్ చెప్పారు. ఆయుధాలు కావాలంటూ ఇజ్రాయిల్ తనను పలుమార్లు కోరిందని, దీంతో ఇజ్రాయిల్ శక్తివంతంగా తయారైందన్నారు. దీని వల్ల శాంతి ఏర్పడినట్లు ట్రంప్ చెప్పారు. శాంతి ఒప్పందం కోసం పనిచేసినవారిలో ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్, అడ్వైజర్ జేర్డ్ కుష్నర్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, సెక్రటరీ పీట్ హెగ్‌సేత్ కీలక పాత్ర పోషించినట్లు చెప్పారు. కెనెసెట్‌లో ప్రసంగించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. అబ్రహం, ఇసాక్, జాకబ్ దేవతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇవాళ ఆకాశం నిర్మలంగా మారిందని, తుపాకులు మూగబోయాయని, సైరన్లు మోగుతున్నాయని, పవిత్ర భూమిలో శాంతి సూర్యుడు ఉదయించాడని ట్రంప్ అన్నారు. ఇక ఎప్పటికీ ఈ ప్రాంతం శాంతియుతంగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది యుద్ధానికి ముగింపు మాత్రమే కాదు%ౌ% టెర్రర్, మరణాలకు కూడా ఇది ముగింపు యుగమన్నారు. విశ్వాసం, దేవుడిపై నమ్మకం పెరిగే యుగం ఇది అన్నారు. మిడిల్ ఈస్ట్‌లో కొత్త చరిత్ర లిఖితమైందన్నారు.

## అతి తక్కువ ధరల్లోనే 365 రోజుల వ్యాలిడిటీ.. అదిరిపోయే బీఎస్ఎన్ఎల్ ప్లాన్!




బీఎస్ఎన్ఎల్‌కు మంచి రోజులు వచ్చాయి. ప్రస్తుతం 4జీ సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి. 5జీ కూడా త్వరలో రానుంది. వినియోగదారుల కోసం తక్కువ ధరల్లోనే ఎక్కువ వ్యాలిడిటీ ఉండే ప్లాన్‌లను తీసుకువస్తోంది.బడ్జెట్ ఫ్రెండ్లీ రీఛార్జ్ ప్లాన్లు అందించడంలో.. బీఎస్ఎన్ఎల్ కస్టమర్లను పెంచుకునే విధంగా ప్లాన్‌లను తీసుకువచ్చింది. గతంలో ప్రైవేట్ కంపెనీలైన జియో, ఎయిర్‌టెల్, వీలు తన టారీఫ్‌లను పెంచాయి. కానీ బీఎస్ఎన్ఎల్ మాత్రం ఎలాంటి ధరలను పెంచలేదు. దీంతో చాలా మంది వినియోగదారులు బీఎస్ఎన్ఎల్ బాట పట్టారు. అప్పటి నుంచి బీఎస్ఎన్ఎల్‌కు మంచి రోజులు వచ్చాయి. ప్రస్తుతం 4జీ సేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి. 5జీ కూడా త్వరలో రానుంది. అయితే వినియోగదారుల కోసం తక్కువ ధరల్లోనే ఎక్కువ వ్యాలిడిటీ ఉండే ప్లాన్‌లను తీసుకువస్తోంది.బడ్జెట్ ఫ్రెండ్లీ రీఛార్జ్ ప్లాన్లు అందించడంలో బీఎస్ఎన్ఎల్‌కు ప్రత్యేక స్థానం ఉంది. కేవలం రూ.1,999 రీఛార్జ్‌తో ఏడాది పాటు వ్యాలిడిటీ ఉండే ప్లాన్‌ను తీసుకువచ్చింది. ఈ ప్లాన్‌లో 365 రోజుల పాటు వ్యాలిడిటీ ఉండనుంది. అలాగేరోజువారీగా 1.64 జీబీ డేటా. మొత్తం 600 జీబీ డేటా ఉంటుంది. అలాగే ఏడాది పాటు అన్‌లిమిటెడ్ కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు అందించనుంది. అలాగే స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కేవలం ఒక రూపాయికే 30 రోజుల అపరిమిత కాల్స్ అందిస్తున్నట్లు తెలిపింది. ఇది కొత్తగా సిమ్ కొనుగోలు చేసేవారికి మాత్రమేనని ఈ ఆఫర్ ప్రకటిస్తున్నట్లు ఇటీవల ట్వీట్ చేసింది బీఎస్ఎన్ఎల్.

## ఇదేందిరా నాయనా.. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘన.. రూ.470 కోట్ల జరిమానా!



వాహనం నిబంధనలను ఉల్లంఘించినప్పుడల్లా దాని చిత్రం, వీడియో ఆధారంగా నివేదిక తయారు చేస్తారు. ఈ నివేదికను కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని ఆపరేటర్ తనిఖీ చేసి ఆపైఅధికారి చలాన్‌ను ఆమోదిస్తారు. నివేదిక ప్రకారం.. 10 కి.మీ పొడవైన.. ప్రతి రోజు ఎంతో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తుంటారు. అలాంటి వారిపై కన్నేసి ఉంచుతున్న ట్రాఫిక్ పోలీసులు.. గట్టి షాకిస్తున్నారు. వారిపై జరిమానా విధిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించవద్దని పదేపదే చెబుతున్నప్పటికీ వాహనదారులు పెడచెవిన పెడుతున్నారు. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వాహనదారులకు భారీ పెనాల్టీలను విధిస్తున్నారు.మహారాష్ట్ర రవాణా శాఖ డేటా ప్రకారం, జూలై 2024 నుండి జూలై 2025 వరకు అంటే ఏడాదిలో ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వేలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై 27.76 లక్షల ఇ-చలాన్లు జారీ చేశారు. ఈ చలాన్ల మొత్తం దాదాపు రూ. 470 కోట్లు. కానీ ఇప్పటివరకు రూ. 51 కోట్లు మాత్రమే వసూలు అయ్యాయి. ఈ 95 కి.మీ. పొడవైన ఎక్స్‌ప్రెస్‌వేలో కారు డ్రైవర్లపై గరిష్ట సంఖ్యలో చలాన్లు జారీ చేశారు అధికారులు. కార్లకు 17.20 లక్షలకు పైగా ఈ-చలాన్లు జారీ అయ్యాయి. దీని తరువాత భారీ గూడ్స్ వాహనాలకు 3.27 లక్షలు, బస్సుల వంటి భారీ ప్రయాణికుల వాహనాలకు 2.48 లక్షలు, టాక్సీలకు .2 లక్షలు, తేలికపాటి గూడ్స్ వాహనాలకు 1.2 లక్షలు జారీ చేశారు. దీనితో పాటు మీడియం గూడ్స్ వాహనాలకు 85,468 ఈ-చలాన్లు, ఆర్టిక్యులేటెడ్ హెవీ గూడ్స్ వాహనాలకు 30,450, మీడియం ప్యాసింజర్ బస్సులకు 14,764 ఈ-చలాన్లు జారీ అయ్యాయి. ఎరోడ్డు భద్రతను పెంచడానికి, ప్రమాదాలను తగ్గించడానికి జూలై 2024లో ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ప్రారంభించింది. ఇందులో రూల్ బ్రేకర్లను గుర్తించే హై-రిజల్యూషన్ కెమెరాలు, ఆధారిత డిటెక్షన్ టూల్స్ ఉన్నాయి. దీని కింద మహారాష్ట్ర రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఎక్స్‌ప్రెస్‌వేపై 40 గ్యాంట్రీలు, వందలాది కెమెరాలను ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టు కోసం రూ.100 కోట్లకు పైగా ఖర్చు చేశారు. అందులో రూ.45 కోట్లు రోడ్డు భద్రతా నిధి నుండి అందించారు.

### చలాన్ ఎలా ప్రాసెస్ అవుతాయి?


ద్వారా వాహనం నిబంధనలను ఉల్లంఘించినప్పుడల్లా దాని చిత్రం, వీడియో ఆధారంగా నివేదిక తయారు చేస్తారు. ఈ నివేదికను కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని ఆపరేటర్ తనిఖీ చేసి ఆపై %=ూ% అధికారి చలాన్‌ను ఆమోదిస్తారు. నివేదిక ప్రకారం.. 10 కి.మీ పొడవైన ఖండాలా ఘాట్ విభాగంలో అతివేగంగా నడపడానికి గరిష్ట చలాన్లు విధించారు. ప్రస్తుత పరిమితి చాలా తక్కువగా ఉన్నందున, మరిన్ని చలాన్లు విధిస్తున్నందున ఈ భాగంలో వేగ పరిమితిని పెంచాలని రవాణాదారులు అంటున్నారు.

## భారత్‌లో టెస్లా దూకుడు.. రెండో షోరూమ్ ప్రారంభం.. ఎక్కడో తెలుసా?



ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ప్రముఖ ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా, భారత్‌లో తమ అమ్మకాలను మరింత పెంచే ప్రక్రియను కొనసాగిస్తుంది. ఇప్పటికే ముంబైలో లొలి షోరూమ్‌ను ఏర్పాటు చేస్తూ భారత్ మార్కెట్‌లోకి అడుగుపెట్టిన టెస్లా.. నెల రోజుల వ్యవధిలోనే దేశ రాజధాని ఢిల్లీలో తన రెండో షోరూమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు సోమవారం ఎన్‌సీఆర్ ప్రాంతంలోని ఏరోసిటీలోని వరల్డ్‌మార్క్ 3 కాంప్లెక్స్‌లో ఈ కొత్త టెస్లా షోరూమ్‌ను ప్రారంభించింది. ప్రపంచ ప్రఖ్యాత ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా, భారత్‌లో తమ వాహనాల మార్కెట్‌ను వేగంగా పెంచుకుంటుంది.ఇప్పటికే ముంబైలో లొలి షోరూమ్‌ను ఏర్పాటు చేస్తూ భారత్ మార్కెట్‌లోకి అడుగుపెట్టిన టెస్లా.. నెల రోజుల వ్యవధిలోనే దేశ రాజధాని ఢిల్లీలో తన రెండో షోరూమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ షోరూమ్‌ను కేవలం కార్ల విక్రయ కేంద్రంగా మాత్రమే కాకుండా, ఒక అద్భుతమైన ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌గా కొనుగోలు దారులకు అందుబాటులో ఉండనుంది. ఈ షోరూమ్‌లో ప్రస్తుతానికి టెస్లా( మోడల్ ) కార్లు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడికి వచ్చే కస్టమర్లు ఈ కార్లను దగ్గరగా పరిశీలించవచ్చు. కారు కొనుగోలు ప్రక్రియతో పాటు చార్జింగ్ ఆప్షన్ల గురించి పూర్తి వివరాలను ఇక్కడి నుంచి తెలుసుకోవచ్చు. ఈ ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ ప్రస్తుతం భారత మార్కెట్లోకి టెస్లా "మోడల్ వై'ను మాత్రమే అందుబాటులోకి తీకొచ్చింది. ఇందుకు వేరియంట్లు ఉన్నాయి. అందులో ఒకటి స్టాండర్డ్ రియర్-వీల్ డ్రైవ్ దీని ధర రూ. 59.89 లక్షలుగా టెస్లా పేర్కొంది. ఇక రెండో వేరియంట్ విషయానికి వస్తే లాంగ్ రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ దీని ధర రూ. 67.89 లక్షలుగా టెస్లా నిర్ణయించింది. గత నెల నుంచి వీటి కోసం బుకింగ్స్ ఓపెన్ చేసిన టెస్లా బుక్ చేసుకున్న వారికి 2025 మూడవ త్రైమాసికం నుంచి డెలివరీలు ప్రారంభించనున్నట్టు పేర్కొంది. పూర్తిగా బిల్ట్-అప్ యూనిట్లపై భారీ దిగుమతి సుంకాలు ఉండటం వల్ల ధరలు అంతర్జాతీయ స్థాయిల కంటే గణనీయంగా ఎక్కువగా ఉన్నాయి, ఇది దాదాపు ధరను రెట్టింపు చేస్తుంది. ఇక ఈ కార్ల ఫర్ఫామెన్స్ విషయానికి కొస్తే.. స్టాండర్డ్ %=ఔణ% మోడల్ ఒక్కసారి ఫుల్ ఛార్జ్ చేస్తే సుమారు 500 కి.మీ.ల రేంజ్‌ని అందిస్తుంది, లాంగ్ రేంజ్ మోడల్‌ను ఒక్కసారి ఫుల్ చార్జ్ చేస్తే.. ఇది 622 కి.మీ.ల రేంజ్‌ను అందిస్తుంది. స్టాండర్డ్ మోడల్ 0 నుండి 100 కి.మీ.ల స్పీడ్‌ను కేవలం 5.9 సెకన్లలోనే అందుకుంటుంది. ఇక లాంగ్ రేంజ్ వెర్షన్ కి 5.6 సెకన్లలో 0 నుంచి 100 స్పీడ్‌ను అందుకుంటుంది. ఈ రెండూ వేరియంట్‌లు 201 కి.మీ.ల గరిష్ట వేగాన్ని కలిగి ఉంటాయి. ఫాస్ట్ చార్జర్‌తో కేవలం 15 నిమిషాల్లోనే స్టాండర్డ్ మోడల్ 238 కిలోమీటర్లు, లాంగ్ రేంజ్ మోడల్ 267 కిలోమీటర్ల రేంజ్‌ను తిరిగి పొందగలవని టెస్లా పేర్కొంది. ఈ మోడల్ %ూ% మెరుగైన ఏరోడైనమిక్స్ సామర్థ్యాన్ని లక్ష్యంగా చేసుకుని మినిమలిస్ట్ డిజైన్ ఫిలాసఫీని అనుసరిస్తుంది.

## మీరు కొత్త కారు కొన్నారా? 1000 కి.మీ వరకు ఈ తప్పులు అస్సలు చేయకండి.. ఎందుకంటే..




చాలా మంది కొత్త కారు కొన్న తర్వాత కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కొత్త కారు కొనుగోలు చేసిన తర్వాత మొదటి వెయ్యి కిలోమీటర్లు తిరిగే వరకు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. కొన్ని చేసే పొరపాట్ల కారణంగా ఆ ప్రభావం ఇంజిన్‌పై పడుతుంది. అంతేకాదు మైలేజీ, కారులోని భాగాలపై తీవ్ర ప్రభావం పడుతుందని టెక్ నిపుణులు సూచిస్తున్నారు.. కొత్త కారు కొనడం ప్రతి ఒక్కరికీ ఒక ప్రత్యేక క్షణం. కానీ దాని మొదటి 1000 కి.మీ మీ వాహనం దీర్ఘాయువు, మెరుగైన పనితీరుకు చాలా ముఖ్యమైనది. ఈ కాలాన్ని ఆటోమొబైల్ భాషలో 'రన్-ఇన్ పీరియడ్' అంటారు. ఇక్కడ ఇంజిన్, గేర్‌బాక్స్, ఇతర యాంత్రిక భాగాలు వాటి ఉత్తమ పనితీరు 'సెట్' చేయబడతాయి. ఈ సమయంలో తప్పుడు డ్రైవింగ్ అలవాట్లు వాహనం పనితీరు, మైలేజీపై చెడు ప్రభావాన్ని చూపుతాయి. మొదటి 1000 కి.మీ.లో గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన ఆ 15 విషయాల గురించి తెలుసుకుందాం. వేగాన్ని అదుపులో ఉంచుకోండి: మొదటి 1000 కి.మీ.లకు 60%-%80 కి.మీ/గం కంటే ఎక్కువ వేగంతో కారు నడపవద్దు. అధిక వేగం ఇంజిన్‌పై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. ఆకస్మిక ఎక్స్‌లేటర్, బ్రేకింగ్‌ను నివారించండి: త్వరగా వెళ్లాలనే ఆలోచనతో వేగవంతంగా వెళ్లడం లేదా గట్టిగా బ్రేకింగ్ చేయడం వల్ల ఇంజిన్, బ్రేక్ సిస్టమ్‌పై ఒత్తిడి పెరుగుతుంది. నెమ్మదిగా వేగవంతం చేయండి. మృదువైన బ్రేకింగ్‌ను ఉపయోగించండి. ఇంజిన్‌ను ఎక్కువసేపు ఐడిల్‌గా ఉంచవద్దు: ఇంజిన్‌ను ఎక్కువసేపు ఆన్ చేయడం వల్ల ఇంధనం వృధా అవుతుంది. ఇంధన పీడనం ప్రభావితం అవుతుంది. తరచుగా సుదూర హైవే డ్రైవింగ్‌ను నివారించండి: ఒకే వేగంతో నిరంతరం నడపడం వల్ల ఇంజిన్ త్వరగా వేడెక్కుతుంది. ని నియంత్రణలో ఉంచండి: ఇంజిన్‌ను 2500%-3000 ౯వీ% కంటే ఎక్కువ తీసుకోకండి. తద్వారా భాగాలు సులభంగా అమరిక అవుతుంది. ఓవర్‌లోడ్ చేయవద్దు: ప్రారంభ దశలో ఎక్కువ మంది ప్రయాణికులతో లేదా భారీ సామానుతో డ్రైవింగ్ చేయడాన్ని నివారించండి. ఏపీ సమతుల్య వినియోగం: అవసరమైనంతవరకే %ూజ%ని నడపండి. కానీ నిరంతరం పూర్తి స్థాయిలో ఆన్‌లో ఉంచవద్దు. గేర్ మార్చేటప్పుడు స్మూత్‌నెస్‌ను కాపాడుకోండి: అకస్మాత్తుగా గేర్లు మార్చడం వల్ల గేర్‌బాక్స్ దెబ్బతింటుంది.ఆయిల్, కూలెంట్ తనిఖీ చేయండి: ప్రతి 200%-%300 కి.మీ.కి ఇంజిన్ ఆయిల్, కూలెంట్ స్థాయిలను తనిఖీ చేయండి. మొదటి సర్వీస్‌ను సమయానికి పూర్తి చేయండి: సాధారణంగా మొదటి సర్వీస్ 1000 కి.మీ తర్వాత జరుగుతుంది. దానిని వాయిదా వేయకండి. టైర్ ఒత్తిడిని గమనించండి: సరికాని టైర్ ప్రెజర్ మైలేజ్, కంట్రోల్, టైర్ లైఫ్‌పై ప్రభావం చూపుతుంది. సస్పెన్షన్, స్టీరింగ్ తనిఖీ చేయండి: మీకు ఏదైనా అసాధారణ శబ్దం లేదా షాక్ అనిపిస్తే వెంటనే దాన్ని తనిఖీ చేయండి. ఆఫ్-రోడింగ్ మానుకోండి: ప్రారంభ దశలో కారును సాధారణ రోడ్లపై మాత్రమే నడపండి. ఎఇంధన ట్యాంక్ ఖాళీగా ఉండనివ్వవద్దు: తక్కువ ఇంధనంతో డ్రైవింగ్ చేయడం వల్ల ఇంజిన్, ఇంధన పంపు దెబ్బతింటాయి. కారు ప్రవర్తనను గమనించండి: ఏదైనా అసాధారణ శబ్దం, కంపనం లేదా పనితీరు క్షీణించినట్లయితే వెంటనే వర్క్‌షాప్‌ను సందర్శించండి.

## ప్రయాణికులకు గుడ్‌న్యూస్.. రైల్వే స్టేషన్లలో ఫ్రీ వై-ఫై.. ఎలా కనెక్ట్ చేసుకోవాలంటే..




భారత ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే.. ఇండియన్ రైల్వేకు భారీగా నిధులు కేటాయించిన కేంద్రం.. డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఇకపై దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 6వేల 115 రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు ఉచిత హైస్పీడ్ వై-ఫై సౌకర్యం కల్పిస్తోంది. భారత ప్రభుత్వంమరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే.. ఇండియన్ రైల్వేకు భారీగా నిధులు కేటాయించిన కేంద్రం.. డిజిటల్ ఇండియా కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఇకపై దేశవ్యాప్తంగా ఉన్న దాదాపు 6వేల 115 రైల్వే స్టేషన్లలో ప్రయాణికులకు ఉచిత హైస్పీడ్ వై-ఫై సౌకర్యం కల్పిస్తోంది. రైల్వే ప్రయాణికులకు హైస్పీడ్ వై-ఫై కల్పిస్తున్నట్లు రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. న్యూఢిల్లీ, అహ్మదాబాద్, ముంబయి, కాచిగూడ, సికింద్రాబాద్ మొదలైన 6,115 రైల్వే స్టేషన్లలో సహా ఈ సేవలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. రైల్వే సౌకర్యాలపై, ఉచిత వై-ఫై సేవ ఉన్న మొత్తం రైల్వే స్టేషన్ల సంఖ్యపై రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ అడిగిన ప్రశ్నలకు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఈ వై-ఫై సదుపాయంతో ప్రయాణికులు సినిమాలు, పాటలు, గేమ్స్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని.. అత్యవసరమైన సమయాల్లో స్టేషన్ పరిసరాల్లో ఆఫీస్ వర్క్ కూడా చేసుకోవచ్చని తెలిపారు.. రైల్వే సహకార సంస్థ 'రైల్‌టెల్' సహకారంతో దీనిని అందిస్తున్నట్లు తెలిపారు "భారతీయ రైల్వేలలోని దాదాపు అన్ని రైల్వే స్టేషన్లలో టెలికాం సర్వీస్ ప్రొవైడర్లు అందించే 4%+/5+% కవరేజ్ ఉంది. ఈ నెట్‌వర్క్‌లను ప్రయాణికులు డేటా కనెక్టివిటీ కోసం కూడా ఉపయోగిస్తున్నారు.. ఫలితంగా ప్రయాణీకుల అనుభవం మెరుగుపడుతుంది. పైన పేర్కొన్న వాటితో పాటు, 6115 రైల్వే స్టేషన్లలో ఉచిత సేవలు కూడా అందించబడ్డాయి" అని వైష్ణవ్ అన్నారు.

### రైల్వే స్టేషన్లలో ని ఎలా కనెక్ట్ చేయాలి?

ఉచిత సేవలను ఉపయోగించి, ప్రయాణీకులు స్టేషన్ ప్రాంగణంలో హై డెఫినిషన్ (%ఎణ%) వీడియోలను చూడవచ్చు.. సినిమాలు, పాటలు, ఆటలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.. ఇంకా వారి ఆఫీస్ పని కూడా ఆన్‌లైన్‌లో చేసుకోవచ్చు. రైల్వే స్టేషన్‌లో ని ఎలా కనెక్ట్ చేసుకోవాలో తెలుసుకుందాం..

### మీ స్మార్ట్‌ఫోన్‌లో మోడ్‌ను ఆన్ చేయండి.

RailWire WiFi నెట్‌వర్క్‌ను ఎంచుకోండి.మొబైల్ నంబర్ ఎంటర్ చేసి, ద్వారా వన్-టైమ్ పాస్‌వర్డ్ పొందండి.OTP ని నమోదు చేసి, హై స్పీడ్ WiFi ని యాక్సెస్ చేయడం ప్రారంభించండి. రైల్వే స్టేషన్లలో వై-ఫై సేవలను రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థ రైల్‌టెల్ అందిస్తోంది.

## తగ్గిన గోల్డ్ రేట్స్.. తులం ఎంత అంటే?






మహిళలు గుడ్ న్యూస్. నేడు గోల్డ్ రేట్స్ స్వల్పంగా తగ్గాయి. చాలా మంది బంగారం కొనుగోలు చేయడానికి ఇంట్రెస్ట్ చూపిస్తుంటారు. కానీ ప్రస్తుతం గోల్డ్ కొనుగోలు చేయడం అనేది ఓ సాహసమే. ఎందుకంటే గోల్డ్ రేట్స్ ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇప్పటికే తులం బంగారం ధర లక్ష మార్క్ దాటిన విషయం తెలిసిందే. కాగా, నేడు మంగళవారం మార్కెట్‌లో బంగారం ధరలు ఎలా ఉన్నాయో చూద్దాం.

ఆగస్టు 12, 2025న 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,02,270 గా ఉండగా,22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.93,740గా ఉంది.

ఆగస్టు 11, 2025 సోమవారం (నిన్న)24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,02,280గా ఉండగా,నేడు రూ.10 తగ్గడంతో గోల్డ్ రేట్ రూ.102,270గా ఉంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర నిన్న రూ.93,750గా ఉండగా, నేడు రూ.10 తగ్గడంతో గోల్డ్ రేట్ రూ.93,740గా ఉంది.

ప్రముఖ నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే.. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.102,270ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.93,740 లుగా ఉంది. మరోవైపు కిలో వెండి ధర రూ.1,26,900లుగా ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.102,270ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.93,740లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,26,900 లుగా ఉంది.



వరంగల్ జిల్లాలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.102,270, 22 క్యారెట్ల ధర రూ. 93,740గా ఉంది. మరోవైపు కిలో వెండి ధర

పోరు తెలంగాణ
డిజిటల్ తెలుగు దినపత్రిక




# మహిళలకు స్ఫూర్తినిస్తుంది

'అమీర్‌లోగ్' చిత్రంలో తాను పోషించిన పాత్ర మహిళలకు స్ఫూర్తినిచ్చేలా ఉంటుందని చెప్పింది కథానాయిక వేదా జలంధర్. హైదరాబాద్ బస్తీ నేపథ్య కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రానికి రమణా రెడ్డి సోము దర్శకత్వం వహించారు. ఈ నెల 21న దాని 'స్పిరిట్' మీడియా ద్వారా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర కథానాయిక వేదా జలంధర్ పాత్రికేయులతో ముచ్చటించింది. ఈ సినిమాలో తాను పక్కింటి అమ్మాయి తరహా పాత్రలో కనిపిస్తానని, ముక్కుసూటిగా మాట్లాడటం తన నైజమని చెప్పింది. 'ఈ సినిమా చూసిన తర్వాత ప్రతీ ఒక్కరూ నా పాత్ర గురించి మాట్లాడుకుంటారు. హైదరాబాద్ నేటివిటీని ప్రతిబింబించే అద్భుతమైన కథ ఇది. ప్రతీ పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి ఆరేళ్లయింది. 'అమీర్‌లోగ్' తప్పకుండా నా కెరీర్‌కు బ్రేక్‌నిస్తుందనే నమ్మకం ఉంది' అని వేదా జలంధర్ తెలిపింది

# మోడ్రన్ మిస్సమ్మ కథ



హర్ష నర్రా, తన్వులు, ఖుషి, సిజు మీనన్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మోడ్రన్ మిస్సమ్మ'. ఎం.బుజ్జిబాబు దర్శకుడు. లాస్య అండ్ మిథున క్రియేషన్స్ తెరకెక్కిస్తున్నాయి. బుధవారం ఈ సినిమాలోని 'బెటర్ బీ ఏ మిస్సమ్మ' అనే తొలిపాటను విడుదల చేశారు. గోపీ సుందర్ స్వరపరిచిన ఈ పాటను కిట్టు విస్సాప్రగడ రచించారు. 'కథపై నమ్మకంతో ఈ సినిమాకు 'మోడ్రన్ మిస్సమ్మ' అనే టైటిల్ పెట్టాం. పెళ్లి నేపథ్యంలో అద్భుతంగా ఆసక్తికరంగా సాగే చిత్రమిది. వినోదానికి 'పెద్దపీట వేశాం' అని దర్శకుడు తెలిపారు. నేటి ట్రెండుకు తగిన సినిమా ఇదని నిర్మాత చిరంజీవి పమిడి పేర్కొన్నారు.కా




# అక్కినేని త్రయం అదరగొట్టే లుక్స్..

## 'వెరైటీ ఇండియా' మ్యాగజైన్ కవర్‌పై నాగ్, చైతూ, అఖిల్!

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 90 ఏళ్ల ఘనమైన కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్న అక్కినేని త్రయం (అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్) తాజాగా సరికొత్త స్టైలిష్ లుక్స్‌తో అదరగొట్టారు. ప్రముఖ అంతర్జాతీయ వినోద మీడియా సంస్థ 'వెరైటీ ఇండియా' రెండో ఎడిషన్ కవర్ పేజీపై ఈ ముగ్గురు హీరోలు మెరిశారు. అతి త్వరలో రాబోయే ఈ ప్రత్యేక సంచిక కోసం అక్కినేని హీరోలు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూలో వారు సినిమా రంగంలో తమ కుటుంబం సాధించిన అరుదైన విజయాలు, గొప్పింటి దశాబ్దాల సినీ ప్రయాణం, నాటి అనుభవాలు మరియు నేటి తరానికి సంబంధించిన ఆసక్తికరమైన విశేషాలను పంచుకున్నారు. అత్యంత ఆకర్షణీయమైన దుస్తుల్లో, స్టైలిష్ అప్పియరెన్స్‌తో ఉన్న ఈ అక్కినేని హీరోల ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# వెంకటేశ్-కల్యాణ్‌రామ్ మూవీకి క్రేజీ టైటిల్.. 'జనవరి 12 విడుదల'

అనిల్ రావిపూడి ప్రమోషన్స్ అంటే మామూలుగా ఉండవు..తన సినిమాల ప్రచారంలోనూ కొత్తదనం చూపించే ఆయన.. తాజాగా మరోసారి తనదైన స్టైల్‌లో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ కీలక పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమాకు టైటిల్ ప్రకటించే విషయంలోనూ ఓ ఫన్నీ ఐడియాను తీసుకొచ్చారు. టైటిల్‌తో పాటు సినిమా విడుదల తేదీని కూడా ఒకేసారి రివీల్ చేసి ఆసక్తి పెంచారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్ హీరోలుగా ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. కీర్తి సురేశ్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమాలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్ బావా బామ్మర్ది పాత్రల్లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా చిత్రబృందం సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించింది. 'జనవరి 12 విడుదల' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేసింది. అంతేకాదు.. 'బావ బామ్మర్ది సౌజన్యంతో' అనే క్యాప్షన్‌ను కూడా జత చేసింది. టైటిల్ వినగానే ఇది సినిమా విడుదల తేదీ అనుకుంటే.. అదే సినిమా పేరుగా ఉండటం విశేషం. టైటిల్ ప్రకటన కోసం రూపొందించిన వీడియోలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతి శెట్టి.. అనిల్ రావిపూడిని సినిమా పేరేంటని అడుగుతారు. అందుకు ఆయన పదే పదే 'జనవరి 12 విడుదల' అని చెబుతుంటారు. తొలుత అది రిలీజ్ డేట్ అని భావించిన హీరోలు.. చివర్లో అదే సినిమా టైటిల్ అని తెలుసుకుని సరదాగా స్పందిస్తారు. టైటిల్ రివీల్ వీడియోలో దర్శకుడు అనిల్ రావిపూడి ప్రముఖ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు ప్రత్యేకంగా నివాళి అర్పించారు. ఈవీవీ తెరకెక్కించిన 'అప్పుల అప్పారావు'లోని కామెడీ సీక్వెన్స్‌ను గుర్తు చేసేలా వీడియోను రూపొందించారు. ఇలా తన కామెడీ మార్క్‌తో పాటు పాత తరం హాస్యాన్ని కలిపి టైటిల్ అనౌన్స్‌మెంట్‌ను కూడా ఓ ఎంటర్‌టైనింగ్ వీడియోగా మార్చారు.

